UNIVERSAL
LIBRARY
OU_204717
UNIVERSAL
LIBRARY

# సుయోధన విజయము.

శ్రీ సీతారామాంజనేయ ముద్రాక్షరశాలయందు ముద్రించఁబడియె.

రాజమహేంద్రవరము.

1927

# సుయోధన విజయము.

కర్త

కోటమర్తి చినరఘుపతిరావు.

కాకినాడ.

రిజిస్టర్డు కాపీరైటు]

[వెల ఒకరూపాయి.

# కృతి.

చ. తనయుని నన్ను గాంచి తనతమ్మునికిం బెనుపంగ నిచ్చె
నా జనకుండు పిన్ననాట; మనసారఁగ నా బదునైదువ
త్సరాల్ పెనిచి యనంతరంబున దివిన్ బడసెం బిన
తండ్రి నాకు దాఁ గనిన సమస్తసంపద లఖండముదం
బున సందఁ జేయుచున్॥

గీ. ఏను పితృవాక్యపాలనాభీష్టుఁ డగుచు
వెలుఁగు ప్రతాపసింహుచరిత్ర దృశ్యకావ్య
గతిని రచియించి కృతినొసంగితిని తల్లి
దండ్రులకు మున్నె జన్మంబు ధన్యమొంద.

గీ. జన్మ మొసఁగిన పితలను సంస్మరించి
వారి ఋణమును దీర్పఁగా వలయుఁ గాన
ప్రథమకృతి నే గృతిఁ బొసఁగి వారి ఋణము
చెలఁగి తీర్చుచు సంతసించితిని మదిని.

గీ. పెంచి పెద్దఁగఁ జేసిన ప్రేమమూర్తి
కీసుయోధనవిజయంబు నేను గృతిగ
పరమభక్తి విశ్వాస తాత్పర్యగరిమ
నందఁ జేసితి నే హృదయార్పణముగ.

గీ. నన్ను దయతోడఁ బెంచె పినతండ్రి
మమతఁ బోషించె రామలక్ష్మమ్మ తల్లి
కాన వారల కీకృతి నే నొసంగి
స్థిర సుకీర్తుల వారి వర్తింపఁ జేతు.

కోటమర్తి చినరఘుపతి రావు.

# తొలిపలుకు.

కావ్యములు ద్వివిధములు. శ్రవ్యములనియు, దృశ్యములనియు నవి పిలువఁబడును. ప్రబంధాదులు శ్రవ్యములు; రూపకములు దృశ్యములు. ఆంధ్రవాఙ్మయము సంస్కృతవాఙ్మయకాలమునకుఁ జిమ్మట నభివృద్ధిలోనికి వచ్చినది. కావున నాంధ్రవాఙ్మయ మభివృద్ధిలోనికిరాక పూర్వమే సంస్కృతమున శ్రవ్య దృశ్యకావ్యములు పెక్కులు బయలుదేరినవి. మహాకవులు వేనవేలు బయలుదేరిరి. సంస్కృతవాఙ్మయములో శ్రవ్యదృశ్యకావ్యములే గాక, గణిత జ్యోతిషశాస్త్రాదిముత్కృష్టగ్రంథములు పెక్కులు బయలు వెడలినవి.

ఇట్టి సంస్కృతభాషాసంపదగ యాంధ్రభాషకొంచెము ప్రాముఖ్యము వహించెను. ఆంధ్రభాష మొదటఁ గొంతకాలమున్నను గ్రంథములు లేక వాడుకభాషగా మాత్రము మెలఁగెనని వాఙ్మయచరిత్రములవలన ద్యోతకమగుచున్నది. పదియవ శతాబ్దములోఁ బుట్టిన మొదటికవి నన్నయభట్టారకుఁడు. ఈతఁడు సంస్కృతభారతమును దెనిఁగింపఁ బ్రారంభించెను. ఈతని పిదపఁ బెక్కు కవులు బయలుదేరిరి.

వీరుచాలవఱకుఁ బురాణాదికములఁ దెనిఁగించినట్లుగఁ దెలియుచున్నది. కాని, స్వతంత్రగ్రంథములను వీరు రచించుట తక్కువ.

స్వతంత్రగ్రంథములు శ్రీకృష్ణ దేవరాయల కాలమునఁ బుట్టినవి. కాని యీగ్రంథములైనను వివిధ విధములుగా గాక, నొక్క ఫక్కినే యలరారినవి. అది ప్రబంధఫక్కి. కావుననే యాంధ్రవాఙ్మయమున శ్రవ్యకావ్యములే గాని, దృశ్యకావ్యములు మొట్టమొదట బయలుదేరలేదు. ఆంధ్రభాషలో మొట్టమొదటి దృశ్యకావ్యమును క్రీ. వె. 1420 సం॥ ప్రాంతమున వినుకొండ వల్లభరాయఁడను ప్రాచీనకవి క్రీడాభిరామ మను దశవిధ రూపకములలో నొక్కటియైన వీధినాటకమును దెనుఁగునరచించెను. ఈతఁడు శ్రీనాథుని కంటెఁ గొంచెము ముందటివాఁడు. ఇతని తరువాత శ్రీనాథుఁడు కూడ వీధినాటకమును రచించినట్టు నొక్క ప్రతీతిగలదు; కాని వీరేశలింగముగారు శ్రీనాథుఁడు వీథినాటకమును రచించుట యసంభవమని వ్రాసియుండిరి. ఏది యెట్లున్నను, శ్రీనాథుఁడు గూడ వీధినాటకమును బ్రతీతి ననుసరించి వ్రాసియుండిన నది రెండవ దృశ్యకావ్యము' కాఁగలదు.

ఈతని పిదప శ్రీకృష్ణదేవరాయల కూతురైన మోహనాంగి, యొకనాటకమును వ్రాసినట్లుఁ దెలియుచున్నది. కొందఱి గ్రంథములను బట్టి చూడఁగాఁ గొందఱు నాటకముల రచించినట్లుగాఁ గానబడుచున్నది. కాని యాగ్రంథము లిప్పు డెచ్చటను గానవచ్చుట లేదు. తరువాతఁ బ్రహ్లాదాది గీతరూప నాటకములు బయలుదేఱెను. కాని, యీగీతరూపనాటకము లెవ్వరురచించిరో సరిగ దెలియవచ్చుటలేదు. ప్రస్తుతకాలమున, మహామహోపాధ్యాయ పరవస్తు వేంకట రంగాచార్య్యవార్లుంగారు శాకుంతలము ప్రబోధ చంద్రోదయమును నాంధ్రీకరించిరి. పిదపమహామహోపాధ్యాయ కొక్కొండ వేంకటరత్నకవిగారు, నరకాసుర విజయవ్యాయోగాదుల రచించిరి. అటు పిమ్మట వేదము వేఁకటరాయశాస్త్రిలుగారు, వావిలాల వాసుదేవశాస్త్రిగారు,కందుకూరి వీరేశలింగము గారు, వడ్డాది సుబ్బారాయపభృతులు పెక్కునాటకములను రచించిరి. ఈక్రింద దశవిధరూపకములను, అవి రచించిన కవులను నేనెఱింగినకొలంది పేర్కొనుచున్నాను.

ప్రకరణము:—మృచ్ఛకటికము

వావిలాల వాసుదేవశాస్త్రిగారు

తిరుపతి వేంకటేశ్వరకవులు

నాటకములు:—శాకుంతలాదులు

కందుకూరి వీరేశలింగముగారు

వడ్డాది సుబ్బారాయుఁడుగారు

ధర్మవరం కృష్ణమాచార్యులుగారు

భాణములు:— వసంతవిలాసభాణము

దేవులపల్లి నృసింహశాస్త్రిగారు

వ్యాయోగములు:—

నరకాసురవిజయవ్యాయోగము

కొక్కొండ వేంకటరత్నకవిగారు

మధ్యమవ్యాయోగము

చిలకమర్తి లక్ష్మీనరశింహముగారు

సమవాకారము:—రంగరాయకదనసమవాకారము

కాళ్ళకూరి సాంబశివరావుగారు

వీథి:—క్రీడాభిరామము

వినుకొండ వల్లభరాయఁడు.

శ్రీనాథుఁడు

అంకము, ఢిమము, ఈహామృగము, [తెలియదు]

ప్రహసనము:— కందుకూరి వీరేశలింగముగారు
(వీరిగ్రంథములు లక్షణయుతముగ లేవు)
నాటిక:—కందుకూరివీరేశలింగముగారు
విలాసిక:— మంగతాయి
కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు
పై రెండురూపకములునుపజాతినాటకములకుఁ జేరినవి.

ఇంతియెగాక పెక్కునాటకములుఇంగ్లీషు(English) భాషనుండియు, వంగ (Bengali) భాషనుండియు, హిందీ [Hindi] భాషనుండియుఁ బరివర్తనములు చేయఁబడినవి. ఈనడుమ బయలుదేరిన నాటకములందుఁ బద్యములకంటె పాట లెక్కుడుగ నుంచి గ్రంథముల రచించుచుండుటచే నాగ్రంథములకు విలువ తగ్గినదని నానమ్మకము. ఈపాటలు పారసీకపద్ధతి ననుసరించి వాడుచున్నారు. కావునఁ బ్రస్తుతకవులు పాటలనాటకముల రచించుటలో నిమగ్నులైరి. నటులు వానినిఁ బ్రదర్శించుటలో నెంతయైన శ్రమఁ జెందుచున్నారు. వాఙ్మయమంతయుఁ బాటలలో నింపివేయఁబడినప్పటినుండియు నాటకముల విషయములో నొక క్రొత్త యాందోళనము బయలుదేరినది. పానుగంటి లక్ష్మీనరసింహరావుగారు శ్రీపాదకామేశ్వరరావుగారు

నాటకములపద్ధతిని మార్చవలెనని విశేషప్రియత్న ములఁ జేయుచుండిరి. నాటకములయందు గద్యపద్య ములేకానిపాట లుండరాదని యొకరును, నాటకములు గద్యాత్మకముగానే యుండవలెనుగాని పద్యములే యుండరాదని వేఱొక్కరును వ్యాసములఁ బెంపొం దించుచు వచ్చిరి. వారివారి యాశయములను బట్టి నరసింహారావుగారు-రామాయణనాటకములను బెక్కు యితరగ్రంథములను; కామేశ్వరరావుగారు-చంద్ర గుప్త, సోహ్రబురుస్తుము మొదలైన గ్రంథము లను, రచించి భాషాసేవ యొనర్చుచుండిరి. ఈగద్యా త్మకములైన నాటకములపై నొక క్రొత్తమార్పు వచ్చినది. అది నాటకమంతయుఁ బద్యరూపకముగా వ్రాయుట. ఇది యాంగ్లేయనాటకరచనాపద్ధతి నను సరించి వచ్చినది. ఇట్టి నాటకములకు మొదట దారి తీసినవారు వావిలాల వాసుదేవశాస్త్రిగారు. వీరు (Julius Ceaser) "జ్యూలియస్సీజరు" అను నాటక మును పద్యముగ వ్రాసియుండిరి. వడ్లూరి పద్మనాభ రాజుగారు కూడ [Othello]ను ఒథెల్లో నాటకము నిట్లే తెనిఁగించిరి. కాని పూర్వకాలములో నిది రుచిం పకపోవుటచే, నీగ్రంథముల నాదరించువా రంతగా

లేకపోయిరి. ఇప్పుడు తిరిగి విశాఖపట్టణము, గంజాం జిల్లాలలోఁ బద్యాత్మకములైన నాటకములు బయలుదేరుచున్నవి. కాని వారు నాటకముల గణము మాత్రము ప్రధానముగాఁ జూచుకొని, యతి ప్రాసముల వదలివేసి, రచియించుచుండిరి.

అట్లు వ్రాయుటచేఁ గవిత్వమున కుండవలసిన లక్షణాదులు లోపించిపోవుటయేగాక సహజమాధుర్యముకూడఁ గొంతవఱకుఁ జెడినదని తలంచవలసివచ్చినది. నియమరహితమైన చంపకోత్పలమాలికలలో నాటకమును రచించుటకంటె సీసములో రచించిన మిక్కిలి బాగుగ నుండి యుండును. [Blank verse] సర్వసాధారణముగా నాంధ్రములోని సీస గీతమాలికలఁ బోలియుండును. గీతపద్యపాదము చిన్నదియగుటచే పెద్దవిషయమును చెప్పవలసి వచ్చినప్పుడు పాదపూర్ణశబ్దములు ప్రయోగింపకుండ రచించుటకు గొంచెముపనిపట్టును గాని సీసపాదములో రచించిన పాదము పెద్దదిగానుండుటచేతను, విశ్రమస్థానాదుల కిడము బాగుగనుండుటచేతను, నట్టిపాదపూర్ణశబ్దములఁ బ్రయోగింపకుండ రచింప ననువగును.

దీనంజేసి నాటకము పద్యములో నుండుటయేగాక

నియమబద్ధమై శాస్త్రసమ్మతమై యుండునని విన్నవించుచున్నాను.

నేనీ సుయోధనవిజయమను నేకాంక నాటకమును యవన పద్ధతిని (Grecian dramas) రచియించితిని. మా మామగారైన బ్రహ్మశ్రీ కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రులుగారితో భారతవిషయిక పరిశీలనవచ్చినప్పుడెల్ల భారతమందలి ధర్మము కౌరవపక్షమున నున్నదని చెప్పుచువచ్చిరి. అంతియెకాక కురుపాండవదాయభాగముఁగూర్చి వారు విపులముగాఁ జర్చించి యుండు పాండవులకు వారసత్వమే లేనట్లు రచియించియుండిరి. వారివాదములును వాదిలును తెలిసికొనిన పిదప భారతమును తిరిగి జాగ్రత్తగా చదువుటచే భారతయుద్ధమందలి నిజమైన ధర్మము విజయము సుయోధనునకే వచ్చినదని దృఢాభిప్రాయుఁడనై యీసుయోధన విజయమును వ్రాయుటకుఁ బూనుకొంటిని. భారతము నందు మహాభక్తివిశ్వాసములు గలవారికి నాగ్రంథముపై కోపము రావచ్చును. వారికి భారతముపై నెట్టి భక్తివిశ్వాసములుగలవో నాకుఁగూడ నట్టి భక్తివిశ్వాసములే సంపూర్ణముగ గలవని హృదయపూర్వకముగా విన్నవించుకొనుచున్నాను. కాని భారతముసం

దలి యితివృత్తములోని లోపములఁ గూర్చి వ్రిజల కుఁ దెలుపు నుద్దేశముతోడను, విషయమును శాంత ముగ గ్రిహించి చక్కఁగ విమర్శించి మంచిచెడుగుల నెల్ల వివరించి తెలుపు పెద్దల యభిప్రాయము లాయా విషయములపై తెలిసికొనవలెనను నభిప్రాయము తోడను నే నీగ్రింథమును రచించి ప్రకటించుటకు సాహసించితిని. ఇందు స్ఖాలిత్యములేమైనను న్న ద్వితీయముద్రణమునందు సవరించుకొందును. పద్యరూప మున వ్రాసిన నాటకమునకు నాందీప్రస్తావనము వచన రూపమున నుండిన బాగుగ నుండదని తలఁచి సీసమాలి కగ దానినిఁ గూడ రచించితిని.

రాజమహేంద్రవరము.
17–7–1927

విధేయుఁడు
కోటమర్తి చినరఘుపతిరావు
గ్రంథకర్త

# పీఠిక.

ఈ శతాబ్దములో నాంధ్రసారస్వతాభివృద్ధికలిగినదో లేదో నిర్ణయించుట కింకను వలనుపడదు. కాని తత్సాహిత్యచరిత్రకొక నూతనయుగము ప్రారంభమయిన దనుమాట సత్యము. భాషావిషయములో స్వతంత్రత కావలయునను వాద మింకను సంపూర్ణముగ నిదమిద్ధమని నిర్ణయింపఁ బడకపోయినను నాంధ్రయువకు లెల్లరు స్వతంత్రతయె వాంఛించుచున్నటులు కన్పట్టుచున్నది. కథలు, నాటకములు, గేయములు, పద్యములుకూడ గ్రామ్యమున ప్రస్తుతము వ్రాయఁబడుచున్నవి—వానినే వర్తమానాంధ్ర ప్రపంచముపా గముకొనుచున్నది—వానినే పాఠకులు తదేకదీక్షతో బఠించుచున్నారు.

దీనికి కారణమొకటి కావలయును. ఏ సారస్వత చరిత్రఁబరీక్షించినను మనకు మూఁడు విభాగము లుస్పష్టముగా గోచరించును. ప్రథమమున నిర్దుష్టము. సద్గుణము మృదువునగు శైలి. శైలికిఁదగి యుండు భావములు. ఇయ్యది యాంధ్రసారస్వతమున నన్నయభట్టారకునితో బ్రారంభమైనది. ఆంగ్ల సారస్వతమున స్పెన్సర్, షేక్సుపియర్ (Spenser &

Shakespeare) తోఁ బ్రారంభమయినది.

రానురాను కవులు మృదువగు శైలిని విడిచి కఠిన సమాసములు క్లిష్టాన్వయములు కూర్చుటలో తమ నేర్పు ప్రకటించువారు. ఇది మనభాషలో ప్రబంధ కవులతో నసఁగా నించుమించు శ్రీనాధునితోఁ బ్రారంభమయినది. ఆంగ్లమున మిల్టన్ (Milton) తోఁ బ్రారంభమయినది. శ్రీనాధుఁడు రచించిన భీమేశ్వర పురాణమును మిల్టన్ రచించిన పేరడైజ్ లాస్టు Paradise Lost ను మన మొక్కసారి పరికించితిమేని భాషాభేదము కానవచ్చినను శైలిభావములు నొక్క విధమున గానవచ్చును. శ్రీనాధునిభీమేశ్వరఖండ ములోని:—

కుక్షిప్రోద్భవనిష్ఠురక్షుధితదుష్ప్రోక్తధాంధకారంబునన్
చక్షుల్ రెంటను చిమ్మచీకటులుగా

.. ... ... ... ...

... ... శతధా భిన్నంబు గావైచినన్.

యును, మిల్టను Paradise Lost లోని:-

.... .... .... .... Satan stood,
Unterrified and like a Comet buried
That fires the length of Orphiuchus huge

In the arctic sky and from his horrid hair
Shakes pestilence and war —

లును సజ్జాని యెదుటఁ జదివినను సామ్యము గ్రహింపకపోము.

ఇఁక మూడవ భాగమున భాష పూర్వకాలీన్యము వదలి యపూర్వపతనము నందును. ఇందులకు మన యుగమే సాక్షి. ఈ యుగమున పూర్వకవులు రచించిన ప్రబంధమువంటి దొక్కటయిన రచింపఁబడలేదనుమాట సత్యదూరము కాఁజాలదు. ఎంకిపాటలు, జోలపాటలు, నీలపాటలు యిట్టి పాటు పోటు మనసారస్వతసముద్రమునకు గలుగుచున్నవి.

ఇన్ని ఖండకావ్యములు, పూర్ణకావ్యములు, గ్రామ్యకథలు, గ్రాంథిక నాటకములు నివి యివి యననేల సర్వగ్రంథములును వెఱ్ఱియో మొఱ్ఱియో వ్రాయఁబడుచున్నను మన భాషలో విమర్శనభాగము చాల తక్కువయయిపోయినది. ఎవరో యొకపండితుఁడు నిష్పక్షపాతబుద్ధితో నే విమర్శనమైన వ్రాసినను నయ్యది ప్రచురింపఁ బడుటకే దుస్సాధ్యమగుచుండ నింక దానిఁజదువు వారెవరుందురు? విమర్శనకిట్టి గౌరవమే జరుగుచుండు నెడల కొలఁదికాలమున

లో విమర్శన మనభాషలో నుండదనియే చెప్పవచ్చు ను. పోప్ అను నాంగ్లకవీశ్వరుఁడు, ఎస్సేఆన్ క్రిటిసి జమ్ (Essay on Criticism) అను దానిలో:—

" A perfect judge shall read each work of wit
With the same spirit that its author writ"

అని లిఖించి యున్నాఁడు. బహుశః ఆంధ్రవిమర్శన లంతగా వ్యాప్తి నందకపోవుటకు వారి పక్షపాతబుద్ధి యే కారణమేమో ?

భాషాస్వాతంత్ర్యమే కాని భావస్వాతంత్ర్యము ఆంధ్రము నందంతగాఁగానవచ్చుటలేదు. ఒకయుదాహరణమిచ్చెదను. విధవావివాహములు నలుపవలెనని యిప్పుడెల్లరును ఘోషించుచున్నారు. ఆసంస్కారము బోధించుచు ననేకకథలు గ్రామ్యమునను గ్రాంథికమునను ననేక పత్రికలయందు వ్రాయఁబడుచున్నవి. వానిలో జాలవఱకు గ్రామ్యములోనే వ్రాయఁబడుచున్నవి. కాని చిత్రమేమన నొకరును క్రొత్త విధమునవానిని బోధింపరు. ఎల్లరును వ్రాయు వస్తువు (Plot)నీక్రింద నిచ్చుచున్నాను.

"ఒక బాల్యవివాహము. వరునిమరణము. వధువు అజ్ఞానము. కొన్నాళ్ళకుజ్ఞానము. విలాపము. ఆత్మహత్యయో లేక బెంగవలన మరణమో?"

ఇదియేవస్తువు. దీనిని నేఁజూచినంతవఱకు నెన్నియో కథలలోఁజూపింపఁగలను.

ఈయుదాహరణమెందులకిచ్చితినన మన భావా స్వాతంత్ర్యముఁ జూపించుటకొఱకు. ఏదియోపద్యము జూచుట దాని ననుకరించుచు దానికన్న పేలవముగ మఱియొకదానిని వ్రాయుట. కథావిధానమును గొను ట- అట్లే రెండవది వ్రాయుటయే కాని యేదైన విష యముఁ దీసికొని దానిని స్వతంత్రముగ నాలోచించి నూతన భావములు వ్రాయుటలేదు. భావములలో నంతగా స్వతంత్రత కన్పింపకపోవుటచేతనే యీ యుగ మున సారస్వతాభివృద్ధి కలిగినదా లేదాయని మొట్ట మొదట నేను సంశయింపవలసి వచ్చినది.

పూర్వగాధలను స్వతంత్ర బుద్ధితో యోజించి రచిం చిన గ్రంథము లెన్నటికైనను మనభాషయందు బయ లు దేరునాయని నేను తలపోయుచుండ శ్రీరఘుపతి రావుగారు తమ సుయోధనవిజయమును జదివి విని పించిరి. ఆంధ్రలోకమునకిట్టి కావ్యము లపూర్వము లౌటచే నద్దానిని సమగ్రముముగ నిచటవిమర్శించుచు న్నాను.

జగమెఱింగిన బ్రాహ్మణుఁడగు శ్రీకాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రిగారియల్లుడగు శ్రీకోటమర్తి చిన్నరఘుపతిరావు గారాంధ్ర లోకమునకుఁ జిరపరిచితులు. వీరు మనుచరిత్రము, ప్రభావతీప్రద్యుమ్నము, శశాంకవిజయము, మున్నగు ప్రబంధములకుఁ జక్కని పీఠికలు వ్రాసి యాంధ్రలోకమునకు విమర్శకులుగను, ప్రతాపసింహ వ్రాసి నాటకకర్తలుగను పరిచయులయియె యున్నారు. ఈ సుయోధనవిజయమును నూతనముగ రచించి చిత్రరంజన్ పత్రికలోఁ బ్రకటించియేయున్నారు.

మాత్యు ఆర్నాల్డు Poetry is a criticism of Life అని కవిత్వమును నిర్వచించియున్నాడు. దీనికనేక వ్యాఖ్యానకర్తలనేక యర్థములఁ దీయుచున్నారు. కాని సాధారణముగ కవిత్వము మానవజీవితముతో సంబంధమత్యంతము గలిగినయొకకళయని చెప్పనొప్పును.

ఈ యుగమున రామాయణభారతాదిపురాణములఁ జదివినచో నందందు మనకు మానవాతీతములు, నమానుషములునగు కొన్ని విషయములు కన్పట్టెడిని. కాని మన మొకదానినిఁ గూర్చి యాలోచింప వలసియున్నది. పూర్వయుగమున జీవించిన మానవులకు, వర్ణింపఁబడిన కృత్యములమానుషముగ కాని మానవాతీత

ములుగ కాని తోఁచియుండకపోవుటచేతనే యట్టివి వ్రాయుటకును పఠించుటకును కారణము గల్గినదేమో?

ఏమయిననేమి? పురాణగాథలు పఠించినచో నందందు గల శూరవీరవరులచరిత్రలు చదివి వాని నాదర్శముగ గొని మనముకూడ నట్లే చరింపయత్నించుట మాత్ర మొక ముఖ్యవిషయము. భారతములో ననేక వీరులచరిత్రలు వర్ణింపఁబడినవి. దానవీరుఁడు, దయావీరుఁడు, ధర్మవీరుఁడు, మున్నగు వీరభేదములు నిందుఁగాననయ్యెడిని.

ఇఁక భారతముం గూర్చి ప్రజలలోఁ బ్రస్తుత మనేక వాదములు ప్రబలియున్నవి. సాధారణముగ పాండవుల ధర్మపరతవలననే జయముకలిగినదని యందఱు ననుకొనుచున్నారు. ఈభావము మూఢజనుల మనస్సునుండి తగినన్ని కారణములఁ జూపించినైన మరల్ప సాధ్యముకాదు. సహేతుకముగనున్న వాదము జ్ఞానమున్న ప్రతిమనుజుఁడును నొప్పుకొని తీరవలసినదే.

టెన్నిసన్ (Tennyson)

Old order changeth yielding place to new
Lest one good thing should corrupt the whole
world

Morte de Arthur

అనివార్యసియున్నాము. ధర్మరాజాదుల ధర్మమెంతవఱ
కున్నదో సుయోధనాధు లెందువలన నోడింపఁబడిరో
సుయోధనవిజయ గ్రంథకర్తలామూలాగ్రముగ నా
లోచించి చక్కని గ్రంథము నాంధ్రలోకమున కర్పిం
చుకొనియున్నారు.

## ఇతివృత్తము

సుయోధనవిజయమునం దితివృత్తము స్వల్పము.
ద్వైపాయనహ్రదప్రాంతమున తొడలు విఱిగి పడిన
సుయోధనుఁడు కడపటి మాటలుగా చెప్పుటయుతివ్వు
దాసమర్థించు కొనుటయు మాత్రమే యితివృత్తము
నందు ముఖ్యాంశములు.

నీయంత్యవాక్యము ల్నే విన(గోరితి
సనిపల్కితివి యిదెయాలకింపు

మని సుయోధనుఁడు శ్రీకృష్ణునితోఁ జెప్పుటమొ
దలిడి భారతయుద్ధము కృష్ణునివలననే ప్రభవించినద
నియుకృష్ణునివలననే పాండవులకు జయము కల్గినదిగాని
వారిప్రజ్ఞవలనఁగాదనియు ధర్మరాజు—

నాచేతనోగాక నీచేతనోభువి

భరణంబుగ్రహియించు బ్రదుకెగాని
భుజబలమ్మున నీశాత్రవుల యుద్ధక్షోణి గెల్చితెచ్చు

కొనలేదనియు వచించినారు. అంతట తానుపడిన సుఖములఁ దలపెట్టినారు. ఇచ్చట వాక్యములు నిజముగ రసోద్భూతములై యున్నవి.

జనుల నాజన్మాంతమును నేను రారాజు
నై యేలిమన్నన లందుకొంటి
దుర్మదశాత్రవదోర్బలగర్వని
ర్వాపణంబొనరించి ప్రతిభఁగంటి

యని తానిహలోకమందు పడిన సుఖములు గౌరవమును వివరించినారు. స్వర్గలోకసౌఖ్యమనుభవింప సమకట్టుచుంటినని తెలిపినారు.

కృష్ణుఁడడ్డువచ్చి యధర్మమెట్లయినను జయింపఁబడవలెననియు కావున సుయోధను నెన్నియో మాయోపాయముల చేతనైన మడియింప వలసివచ్చినదని యనుఁ బ్రత్యుత్తరమిచ్చుట యేకాక సుయోధనుని యక్రమకృత్యము లొక్కటొక్కటిగ పేర్కొనినారు. అవి 1. భీమునకు విషమిచ్చి చంపయత్నించుట 2. మాయజూదమాడుట 3. పాంచాలినీడ్చుట 4. పాండవులచే వనాజ్ఞాత వాసంబులు చేయించుట.

ముఖ్యముగా నెల్లప్పుడును పరితివారును ధార్తరాష్ట్రుల యన్యాయముల కివియే యుదాహరణములు

గా నిచ్చుచుందురు. కావున కవియు వీనినే తీసికొని యందెంతవరకు సత్యమున్నదో కనుఁగొన యత్నించి నాను.

సుయోధనుఁడు శ్రీకృష్ణునకుఁ దగిన సమాధాన మీయ సంకల్పించుకొని ముందు

పక్షపాతంబుచే వగ్గిల్లదు నిజంబు
పక్షపాతికెట దృక్పథము వేఱు

కావున శ్రీకృష్ణుఁడు పాండవపక్షపాతియే యైనను నా పక్షపాతమొకింతసేపు కట్టిపెట్టి సత్యాన్వేషణ ము నర్పుమని ప్రార్థించి భారతవర్షమును బాలించెడి ప్రభు వులేకపోవుటచే వ్యాసమహర్షిని బిలిపించి యతనివలన నంబ నంబాలిక దాసీలకు గ్రమముగా ధృతరాష్ట్ర పాండురాజ విదురులు కలిగిరనియు విదురుఁడన్యయో నిజుఁడు కాన నతఁడు రాజ్యానర్హుఁడై నాడనియు పాండు రాజునకుఁ గూడ పాఁడిమమువలన రాజ్యార్హత నశించె ననియు నయ్యెడ ధర్మవేత్తలు ధృతరాష్ట్రుఁడగ్రజన్ముఁ డుకాన నతనినిఁ జక్రవర్తిగ నియమించి పాండురాజును సైన్యాధిపతిగ నొనరించి వారనియును నందువలనఁ బాండురాజు ధృతరాష్ట్రుని కనేకదేశములఁజయించి ధన

ముఁజేకూర్చెననియుఁ జెల్పెను. తరువాత పాండవులు పాలు పంపులని బాధింప మొదలిడిరనియు

కలకాలమున నుండి కౌరవరాజ్యంబు

పాలుపంపులులేక ప్రబలుచుండె

ననియు నవిభక్తరాజ్యములోఁ బాండవుఁలుపాలుగోరుట యధర్మమనియు నంతియే కాక

... ... పాండునృపతి

యే గోరలేనట్టి యీరాజ్యభాగంబు

పాండవుల్ గోర సద్వర్తనంబె?

యనియు పృచ్ఛించినాఁడు. అంత సహదేవుఁడు వీనికే మికాని భీమునెందులకు బాధింప వలసి వచ్చిన దని యడ్డుతగులును.

అద్దానికి సుయోధనుఁడు సయ్యాటలను వంకతో ధార్తరాష్ట్రులనెల్లరిని భీముఁడు బాధింప మొదలిడెనని యు మానమే ధనముగాఁగలిగి యుత్తమక్షత్రియుఁడై న తనకిది సహ్యముకాదనియు నందుచేతనే భీమునిఁ జంపయత్నించితిననియు సమర్థించుకొనును. ఈవిషయ ముంగూర్చి ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక రుధిరోద్గారి ఆశ్వయుజ పుష్యమాసపు సంఖ్యలో పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారిట్లు లిఖించియుండిరి.

'ఈ దుష్టచేష్టలు చేయునాటికి భీమునికి 16, 15 సంవత్సరములకుఁ దక్కువ యుండదు'

ఈ వ్యాసమును ఖండించుచు మల్లాది రామకృష్ణ చయనులు గారిట్లు సమర్థించిరి:—

ఏవం సభార్తరాష్ట్రాంశ్చ స్పర్ధమానో వృకోదరః
అప్రియేతిష్ఠదత్యంతం బాల్యాన్నద్రోహచేతసా"

ఈ విధముగా వృకోదరుఁడు బాల్యముచే దుర్యోధనాదుల కప్రియ మాచరించెను గాని ద్రోహబుద్ధి చేతగాదు అని భారతమునందు కలదు. ద్రోహబుద్ధి చేతనే యహిత మాచరించెనని వీరువ్రాయుట యసంగతము" కాని, భీముఁడును సుయోధనుఁడును సమాన వయస్కులని భారతము చెప్పుచున్నప్పుడు సుయోధనుని చర్యలు కూడ బాల్యచేష్టలేల కాఁగూడదు? అతనిచర్యలకు ద్రోహబుద్ధి నారోపింపవలసిన కారణమేమి?

మఱియు రమారమి పదునారు సంవత్సరములు గలవానికి పరులనుబాధింపఁ గూడదను జ్ఞానము రాదా యనునది విచారణీయాంశము. అదిగాక—

కర్మమేమదికి సాక్ష్యంబౌసంగును కర్మ
మరయ వాక్కునకు సాక్ష్యంబౌసంగు

కర్మంబునకును సాక్ష్యంబు లేదిక కాన
కర్మంబుచే నరు గనగనగును.,

అని శ్రీరఘుపతిరావుగారొక సందర్భమున వ్రాసి నట్లు భీముని దుశ్చేష్టలే యితని దుర్బుద్ధికి సాక్ష్యము లనుటకు సందేహము లేదు.

నకులుడంత ధర్మరాజును యువరాజుగా జేయ ధృతరాష్ట్రుడు సంకల్పించుకొనినప్పుడు సుయోధనుని నీవేలయడ్డు తగిలితివో తెల్పుమని యడిగెను.

దానికి ధృతరాష్ట్రున కౌరసపుత్రుడను, దానరియు నందుచే యువరాజపట్టాభిషేకము తనకు జరుగవల యునే గాని యితరులకు హక్కు లేదనియు పాండు రాజు నాస్తికంతకు ధర్మరా జధికారియనియు నుడివెను. లాక్షాగృహ దహనవిషయ మడుగనుడనుగ సుయో ధనుడు——

పగగల్గువారలు పరిబలుచుండెదరేని
పామున్నయింటిలో బ్రిబలుటెయగు,

ననియు చివరకు నిప్పు తగిల్చినవాడు భీముడేయని యు వాకుచ్చెను.

ఇక మాయజూదమును గూర్చి జూదమునకు ముందు పాచికలు శోధించుకొనవలసిన బాధ్యత

పాండవులయందె యున్నదనియు, ఓడి పోయితినని ధర్మజుఁడే యొప్పుకొనియెననియు, ఒకయాటనోడిన తరువాత నూరకొనక చివరంటనాడుట ధర్మజునితప్పిదమౌననియు వ్రాసెను. ఇంతియేకాక—

"ఆటగెల్చినఁదాను నఖిలరాజ్యంబుల
గ్రహియించియేలుకో గలఁడెయపుడు?

అని సుయోధనుఁడు వైచిన ప్రశ్న ప్రశంసనీయము. ఏలన సప్తవ్యసనంబులలో నొక్కటియగు జూదంబునం బ్రాఁగానుటయే ధర్మజసుయోధనులలోపము. అట్టియెడఁ బందెములు వైచుకొని యొకరిరాజ్యమొకరపహరింపవలెనను సమానద్రోహచింతావేశులయినపుడు ధర్మరాజే విధమున సుయోధనుకంటె ఘనుఁడో ?

ద్రౌపదిం గూర్చి యామె జన్మవృత్తాంతముం గూర్చియు చక్కఁగఁ దెలుపఁబడి యామె నింద్యచరిత్రయని నిరూపింపఁబడినది. ఈమె పతివ్రతనాదికములు వేఱొకచో విపులముగఁ జెప్పంపఁబడినవి గాన నిటఁ జేర్కొన లేదు.

(Greek Tragedies.)

-యవనకష్టాంతనాటకములు : సుయోధనవిజయము-

ఈ నాటకము సాధారణ నాటకములవంటిదికాదు. ఏకాంక సర్వసీస నాటకము. ఇట్టి నాటకములు పూర్వము యవనకవులగు (Euripides, Sophocles and Aeschylies) యూరిపిడీజు, సోఫాక్లీజు, ఈస్కిలను వ్రాసియుండిరి. వారికష్టాంత నాటకములు (Tragedies.) అన్నియు నీమాదిరివే.

యవనకష్టాంతనాటకములందు స్థానకాలకథా సందర్భసామరస్యములు(Unity of place, time and action)అనిసామరస్యత్రియము(Three Unities) కానవచ్చెడిని. ఆనాటకమేదియో యొక్కప్రదేశము ననే జరుగవలయును. ఇదియే స్థానసామరస్యము. (Unity of place )ఒక్కదినముననగా నిరువదినాల్గు గంటలలో జరుగనగు విషయములు మాత్రమే యందుప్రదర్శింపఁబడవలయును.ఇదియేకాలసామరస్యము (Unity of time)కథాసందర్భమంతయు నొక్కయంతమునకు (End) రావలయు నంతియే కాని దేనికది విడిపోయినట్లుండకూడదు. ఇదియే కథాసందర్భసామరస్యము(Unity of action)యవనులు (G recians)సామరస్యత్రియమును ముఖ్యముగా జూచెడి వారు. ఈ లక్షణములన్నియు నేత్ప్రేఅపరకించితిమేని యీనుమో

ధనవిజయమునందు కాననగును. ఈనాటక మొక్క ప్రదేశముననే జరిగినది. ద్వైపాయన హ్రద ప్రాంతమున. ఇదిజరిగిన కాలము కొన్ని గంటలకన్న నెక్కువ కాదు. కథాసామరస్యమును పూర్ణముగ నున్నయది.

సాధారణముగా యవననాటకములునిర్వచనముగ (Blank Verse) లో వ్రాయంబడుచుండెడివి. సుయోధనవిజయముకూడ నిర్వచనముగ సర్వశీసముగ వ్రాయంబడినది. మనము ప్రకోక యవన పద్ధతినివ్రాయం బడిన నాటకమును, సుయోధనవిజయమును, దీసికొని సుయోధనవిజయము లోని యవననాటకలక్షణములు బరిశీలింతము.

మిల్టన్ [Milton] విశ్వప్రియత్నములుచేసి యవన పద్ధతిని వ్రాసిన సామ్సన్ అగొనిస్టీసు [Samson Agonistes] ను తీసికొనుదుము. శ్రీరఘుపతిరావుగారి సుయోధనవిజయమును తీసికొనుదుము. ముఖ్యముగా మనకు గోచరించువిషయముల నిటనిచ్చుచున్నాడను.

సామ్సన్ మహాబలశాలి. ఆయుధవిద్యా ప్రవీణుడు. కాలవశమున పగతురకు జిక్కియు శత్రువులందునుమాడంగలిగెను. కాని యట్లు శాత్రవభంజ

నం బొనరించు సమయమున తాను మరణింపవలసి వచ్చినను వెనుదీయలేదు—సుయోధనుఁడు మానధనుఁడు. గదావిద్యావైభవ సంపన్నుఁడు. అతఁడును కాలవశమున శత్రులచే జితుఁడయ్యు శత్రుభంజనంబొనరించి దివి కరిగి స్వర్గసౌఖ్యముల ననుభవింపఁగలిగెను.

### → పాత్రౌచిత్యము ←

ఈ కథకంతకును మూలము సుయోధనుఁడు. తరువాత ముఖ్యమగుపాత్ర ద్రౌపది. సుయోధనద్రౌపదుల పాత్రౌచిత్యప్రదర్శనము మాత్రమే యిందు విపులముగఁ జర్చింపఁబడినవి.

సుయోధనుఁడు:—మానమే ప్రాణములుగఁ జూచికొను సుయోధనుఁడు తగిపరీతిని వర్ణింపఁబడినాఁడు. తెగిపడిననేమి? మానముమాత్రము వర్జింపలేదు. ప్రాణములను ధర్మయుద్ధమునఁ గోల్పోవుచుకూడ నమ్మానధనుఁడు తనకృత్యములెల్ల యనింద్యములు, అగర్హ్యములునని నిరూపింపఁ గలిగెను. బ్రతికినన్నాళ్ళు సుఖములఁబడసి యథేచ్ఛగ నరివర్గమదేభకంఠీరవుగ మెలఁగినాఁడు. ప్రాణముల్గోల్పోయి స్వర్గముగొనినట్టి మహాచక్రవర్తి సుయోధనుఁడు. దుర్దమపరాక్రమోద్దండ వాహినీనాయకుఁడు సుయోధనుఁడు. ఒక్కఁడై యుం

డియు నైదుగురి పాండవులలో భీమునిమాత్రమెయెన్ను కొనినధీరపరుఁడు. తక్కువవాఁడగు-చోతప్పక నకులునో, సహదేవునో, ధర్మజునో గదాయుద్ధమునకు రమ్మని యోడించి యుండును. కానిమానమాత్రప్రాణియగు సుయోధనుఁడటు చేయలేదు. మానమో? ప్రాణమో? ఏది? సుయోధనునకు మానమె ప్రధానముగఁ గన్పట్టినది- అందులకె గదాయుద్ధమున తనతో సమానుఁడగు భీముని మాత్రమే పిల్చియన్యాయయుద్ధమున నాతనివలన జయింపఁబడెను.

ద్రౌపది:—ఈమెను చిత్రించుటలో కవి తన తర్కచాతుర్యమెల్లఁ గనపరచినాఁడు. ఈమె వృత్తాంతమంతయు సుయోధనునిచే కవి యిట్లు చెప్పించినాఁడు. సుయోధనుఁడు ద్రౌపదిఁ గూర్చినకధను చెప్పుటలో స్వారస్యము కలదు.

ద్రౌపదికి స్వయంవర మాచరింపఁ దలఁచి ద్రుపదుఁడఖిల రాజన్యులఁ బిలిచెను. బ్రాహ్మణవేషములతో మీరు (పాండవులు) స్వయంవరమునకు రాఁగ క్షత్రియార్హముఁగ మేము (ధార్తరాష్ట్రులము) యేగితిమి. అర్జునుఁడు మత్స్యయంత్రముఁ గూల్పగా ద్రౌపది పూలమాల నర్జునుని కంఠమం దుంచెను. అట్లు

అర్జునునికి భార్యయైన ద్రౌపది పాలుపంపక మయి నది. ఏదేశమందును నిట్టి యాచారము లేదు—నో హానిభ్రాంతులై యర్జునుని భార్యను మీరెల్లరు పరి ణయము చేసికొనిరి. ఇది యధర్మము. ఏలన ?

మత్స్య యంత్రంబును మరి మీసహోదరు
లొకసారి కొట్టిరే యుర్వింబడగ ?
పుష్పమాలలఁగొంచు పూఁబోడి యొకసారి
యేవురి గళములనిడెనె యపుడు ?
ద్రోవదినిడనెంచు దుౢపదరాజేంద్రుండు
పంచపాండవులకుఁపడతి నిడెనె ?,

యనికవిప్పృచ్ఛించినాఁడు. ఇట్టిసందర్భమున నాకాం తను మీరెల్లు గైకొనిరని యడిగెను. భిక్షయని మీ తల్లితో నసత్యము చెప్పిద్రౌపదినిఁ బంచుకొనిరి. కాని

భిక్షగానిడె నొక్క వెలఁదిని మీమామ
బిచ్చంబుగామీరుఁ దెచ్చుకొనిరె ?
యనిగెల్చి తెచ్చినయతివ భిక్షంబౌనె?
మనుజుల భిక్షంబుమహినిఁ గలదె ?,

అయిదుగురకును కాంతనిచ్చుటకు దుౢపదుఁడు సమ్మతింపనప్పుడు జ్యేష్ఠులగు ధర్మభీముల కుద్వాహ మైనగాని యర్జునునికి కాఁగూడ దని సాకుఁ గల్పించి

యేవురు వివాహమాడిరి—అదియుఁగాక / ద్రోణుని వధియించు శూరుని భార్యయగు కుమారి ద్రుపదున కీశ్వరుని వరమున జన్మింప నామె నైదుగురును బెండ్లాడుట యధర్మము కాదానిమఱియు.

దైవనిర్దిష్టంబు తప్ప నీనాటికి
పురుషప్రయత్నంబు భువిని గెల్చు

ఇఁక ద్రౌపది పూర్వవృత్తాంత మరయుదము. పూర్వజన్మములో ద్రౌపది మౌద్గల్యుని భార్య. అతఁడధిక రోగార్తుఁడై నపుడు పరిచర్యలుచేయు ద్రౌపదిని వరము కోరుకొమ్మన కామభోగంబులంగోర నతఁడామె కోర్కెదీర్చి దివికేగె. కాని యామె యాభోగంబులందు తృప్తి కాంచలేదు. రెండవ జన్మంబున—

కామంబుదీర్చెడి కాంతునికయి
యీశునిఁబ్రార్థింప నెసగెను. ...

తుచ్ఛకామభోగము కొఱకే కాంతయు నెన్నడును ఈశ్వరునిఁ బ్రార్థింప లేదు. ఈ మానిని ప్రార్థన విని ఈశుఁడు ప్రత్యక్షముకాగ సంభ్రమముతోఁ బతి-పతి-పతి యని పలుమారులు పలవించెను. అప్పుడు శివుఁడు

కామాంధురాలైన కాంత యీమెయటంచు
వనితకు వలసిన పతులనొసఁగె

దానిచే మీరలు తన్వికిఁబతులై రి
కాంతకామార్తిని. గడవఁబెట్ట.

ద్రౌపదిని సభకు దీసికొని రమ్మని నప్పు డామె ఏయుగంబులందు నెట్టి దుష్కృతవుండు అని భర్తను దుష్కృతవునిగా జేసినై చినది. మఱియు,

మున్నునన్నోడి వడి మఱి తన్నునోటు
వడియెనో తన్నుము న్నోటువడి విభుండు
గ్రిన్నన నన్నోటువడియెనో యన్ననాకు
నెఱుఁగఁజెప్పుము ... ...

అని ధర్మసందేహము (Law Point) తీసుకొని వచ్చినది. ఈ ధర్మసందేహము ప్రత్యుత్తర మీయఁదగినదియే మైయుండినయెడల సభలోనున్న ధర్మవిదు లేరును ప్రత్యుత్తరమీయరో? ఒక్క వికర్ణుఁడు మాత్రమే యీపనికేల పూనుకొనెను? భీష్మాదులు నిజము చెప్పుటకేల జంకవలయును? అట్లొనర్చినఁగాని వారిపొట్టగడువదాయేమి? మఱియు నీమె గుణముల నుగ్గడించుటకిక నొక్క యుదాహరణమిచ్చెదను. శ్రీకృష్ణుని రాయబారము వ్యర్థమై వెడలిపోవుచున్నప్పుడితఁడు కర్ణుని బిల్చి పూర్వవృత్తాంత మెఱింగించి

ఏను నిన్ను సామ్రాజ్యంబునకు నభిషిక్తుం జేయుదు. మహీ చక్రంబేలుమని చెప్పి

కం॥ పాంచాలరాజపుత్త్రియు
 సంచితముగ నిన్నుబొందు నాఱవవరుసన్
 సంచిత పుణ్యుఁడ వీవొక
 యించుకయును వేఱుసేయ కేతె మ్మలమిన్.

అనిప్రార్థించినాఁడు. దీనివలన ద్రౌపది యేవురు భర్తలనే కాక యధికభర్తలఁ బడయుటకు సిద్ధముగనే యున్నదని తేలినది.

వికర్ణుఁడిట్లనె. జూదంబు వేటయు పానంబు బహుభక్షణాసక్తియు దుర్వ్యసనములు. వానికింజిక్కి పాండవాగ్రజుండు పాండవుల కందఱకు సాధారణ ధనంబయిన పాంచాలినిఁ బణంబు సేసెంగావున ద్రౌపది యధర్మవిజిత. దీనికి కర్ణుండిట్లు ప్రత్యుత్తరమిచ్చినాఁడు.

ధర్మజుండు దనసర్వస్వమునొడ్డి యోటువడినప్పుడిదిదానికి వెలితికాదు కావున ధర్మవిజితయ. అట్లుగాని నాఁడీపాండవులిందఱును విజితగా నేలయొడంబడుదురు. మఱి యేకవస్త్రయైయున్న దీని సభకుందోడ్కొనివచ్చుట యధర్మంబంటిరి. భార్యకు దైవాధిష్ఠితుండయి

నభర్తయొక్కరుండ. ఇదియనేకభర్తృకగావున బంధకి యనంబడు.

కర్ణుఁడుచెప్పిన పల్కులలో నధర్మము కాని యన త్యము కాని యున్నయెడల భీష్మద్రోణ విదురులును, పంచపాండవులు నూరకొనియుందురా? దీనికిఁదగిన ప్రత్యుత్తరమిచ్చియె యుందురు. కాని కర్ణుమాటల కొక్కరైన నెదురుచెప్పలేదు. అదియుంగాక, ధర్మశా స్త్రంబందు ధర్మజుండెక్కడో ద్రౌపదియెక్కడో ధర్మ రతుల కెఱుగంగరాదో? యని శ్రీరఘుపతిరావు గారు వేయించినప్రశ్న బహుశ్లాఘనీయముగ నున్నది. మఱియు మయసభలో సుయోధనుఁడు క్రిందఁబడిన పుడు కరుణార్ద్రహృదయముతో నుపచారము లొన ర్పవలయునుగాని పకపకనవ్వుచువినోదముగాఁ జూచు ట నింద్యమనియు

అరయదు మఱదిగా నతివ యాసభఁగాన
నాయింతి బూజింపనగునె సభను
ఆ మెకు నే నెంతయాప్తుండనో నాకు
నామెయు నంతయేయాప్తురాలు

అనియు నప్పటి పరాభవమునకుఁ దగిన ప్రతీకారము తనసభలో నామెకే జరిగినదనియు— జూదమయినతరు

వాత సభలోనికిఁ బిలిపించినప్పుడు రాకయుండెననియు తీసికొని వచ్చునపు డధోనీవియై యున్న యామె వస్త్రము క్రిందఁబడినదనియు వచించెను.

ధర్మజుఁడు:—ఏమియు చేతకానివానివలె నితఁడు చిత్రింపఁబడినాడు. ధర్మజుఁడను పేరు నధర్మజుఁడని మార్చిన బాగుండుననని సూచింపఁబడినది.

తివిరి బాణంబు సంధింపలేక

యిన్నకుండినయప్డు మెలతప్పె నాసచే

యర్జునుండాయంత్రి మసని గూల్చె

నానాతి గ్రహియింప నందఱుసిద్ధమాటచేత ధర్మజుని మోహాంధత స్పష్టముగ గానవచ్చెను.

ఇఁక కృష్ణుఁడు:—

అన్యాయపథమున నధికులఁజేసి మి

మ్మతఁడుఁ దుష్పథగామియై చెలంగె

కావునఁగృష్ణుని గణుతింప రెవ్వరు

మీరలు మఱియు మీవారె కాని.

ఈగ్రంథకర్త శ్రీకృష్ణుని నొక యవతారపురుషునిగఁ దీసికొనలేదు. ప్రతిభావంతునిగను, రాజనీతిపరునిగను తెలిపినాడు.కృష్ణుండుజెప్పిన గీతల నటులుంచి రాజ కార్యధురంధరుఁడైన కృష్ణుని మానవమాత్రునిగ దీసి

కొని కవి కృష్ణునిరాజకీయజీవితము విమర్శించి యున్నారు.

దానివలననే యతనికి దేవత్వ మారోపింపఁబడినద నియు నతఁడు పక్షపాతియనియు నభిప్రాయపడినారు. విమర్శకు లీ విషయము పరిశోధించి సత్యముఁగన్గొనెదర నితలఁచెదను. కృష్ణుఁడొకఁరాజకీయవేత్తగ వర్ణింపఁబడి నారు. అతఁడే రాయబారము నెట్లైన పాడుచేసి సంధి కుదర్పక యొల్లోయుద్ధము జరుగునట్లు ప్రేరేపించినాఁడు. రాయబారమై వచ్చినపుడు కార్యము శాంతముగ సాధించుకొనవలెఁగాని తొందరపడి పల్లదములు వల్కి కార్యముఁజెడఁగొట్టుట రాయబారికిఁ దగదు. అదియుఁ గాక యాదినుండి యంతమువఱకును శ్రీకృష్ణునికి సు యోధనాదులపై క్రోధమున్నది. దానినిబాగుగ తీర్చు కొన యత్నించినాఁడు.

పాండవదుస్థితి భరియింప లేమి నీ
దారుణంబులఁ జేయఁ దలఁచినాడు
నీయేపు సహింపనేరమి తా నిట్టి
దారుణంబులఁ జేయఁ దలఁచినాడు

**బహూశః అర్జునుఁడు తన బావయగుటవలననేమో?**
**అందులకయియే**

పాండవపక్షంబు వాఁడవీవనఁగ్గుణ్ణు
ధర్మంబునీదు సోదరినిబట్టి

యని కవియే రచియుంచియుండె.

అతఁడు తన్నధికుఁడటంచు నెన్నినిపరులపై దండెత్తివధియింపఁ బూనుకొనుటధర్మమా? ఇకరాయబారిగకృష్ణుఁ డెట్లువర్తించెను? సభకుపోయినదాదిపరుషవాక్యములే! సంధిమాటలే లేవు. సరికదా! కార్యమెట్లయిన భగ్నమొనర్చుకొనుటకు వచ్చి యాలోపముకౌరవులమీఁదికిఁ దోసివైచెను.

ఆరీతిగాకుండ నధికారరవముల
రాయబారము దెల్పరాదుసభను

అనిరాయబారికృత్యములఁగవి చక్కఁగఁదెల్పినాఁడు చిట్టచివర వ్యాసునకును భీష్మునకును గల భేదము వర్ణింపఁబడినది. వ్యాసుఁడంబికాంబాలికలఁగూడుట, తరువాత దాసినిఁ గనిపెట్టలేకపోవుట యసంభవమనియు వ్యాసుఁడొకపక్షముండి వాదించుట యన్యాయమనియు నిరూపింపఁబడినవి. భీష్ముఁడతని కన్న నెన్నియోమడుంగుల నధికుఁడనియు.

వీరుల నప్రతివీరుండు భీష్ముండు
సద్బ్రహ్మచారి సచ్ఛాస్త్రవేత్త

పితృవాక్యపాలనాభీష్ముంఁడు భీష్ముంఁడు
పరమభక్తుంఁడు శుభంకరుంఁడు

కావున ననేకవిధముల వ్యాసునికంటె నధికుఁడనియు, నట్టివాఁడు కౌరవపక్షమున నుండుటచే న్యాయము కౌరవులదే యనియు, పాండవపక్షమున లేకుండుటయే తత్పక్షాధర్మము రూఢిచేయుచున్నదనియు,నొకనిమనోభావము లతనిచర్యలవలన దెలిసికొనవచ్చుననియు, మనోవాక్కాయకర్మములకున్న సంబంధమును, కవి చక్కఁగ జూపించియున్నాఁడు.

ఇఁకనొక్కవిషయము. భారతయుద్ధమునందలి సత్యాసత్యములు ధర్మాధర్మములు కురువృద్ధులైన వ్యాస భీష్ములకుఁ దక్క లాతివారికి తెలియవని స్పష్టముగ జెప్పవచ్చును. వ్యాసుఁడు పాండవపక్షమందుండెను. భీష్ముఁడు కౌరవపక్షమందుండెను. కురువృద్ధు లిరువురిట్లు చెరియొకపక్షమునకుఁజెందియున్నపుడు ధర్మమెవరిపక్షముననున్నదో కనుఁగొనుట కష్టముకదా! అట్టియెడ ఆభీష్మవ్యాసుల తారతమ్యముల గ్రహించినవారిరువురిలోనెవరుసత్త్వగుణాధికులో నిర్ణయించుకొనవచ్చును. అందులకనియే శ్రీరఘుపతిరావుగా రిరువురను చదువరులకు జూపించియున్నారు.

భీష్ముఁడు: పిత్రాజ్ఞాపాలకుఁడు, సద్బ్రహ్మచారి, త్రిక
రణశుద్ధుఁడు, మహాత్యాగి, పరమభక్తుఁడు, ఉత్తమ
క్షత్రియుఁడు, అను నారుసద్గుణములుఁగలిగి యద్వి
తీయుఁడై మెలఁగుచుండగా; వ్యాసుఁడు: తండ్రి
యాజ్ఞలఁద్రోసివైచినాఁడు, పరనారులై వితంతువులై
న నంబికా అంబాలికల పొందునందినాఁడు, శూ
ద్రస్త్రీ సంగమముఁజేసినాఁడు, నిషాదజన్మముఁ గలిగి
నాఁడు, ధర్మవిరుద్ధముగా సూతసంజయులకు వేద
విద్య చెప్పినాఁడు, ఒక్క స్త్రీకి పెక్కండ్రుపతులగుట
కంగీకరించినాఁడు, కర్ణునిజన్మము శాస్త్రీయమని కుంతి
తో దెలిపినాఁడు. వీరిరువురో యెవరుత్తమ పురుషులో
చదువరులె గ్రహించుకొందురుగాక.

శ్రీకృష్ణుఁడుతనతప్పిదమొప్పుకొని
  కలిరాజయుగనాటకంబునకియ్యది
  నాందిగా జూపించినాఁడ నిపుడు

సుయోధనున కెంతబలమున్నను రాజ్యాంగవేత్తయగు
కృష్ణునిచేతనోడింపఁబడెను.

  ఇది నిరూపింపఁగ నిస్టోత్రియుద్ధంబు
  నొనరించి విజయంబు నొందినాఁడ

ననెను. కలియుగమున మన కుదాహరణములు నందుని యఖండైశ్వర్యములను చంద్రగుప్తుని కొసంగిన చాణక్యుని రాజనీతి. ఢిల్లీసుల్తాను నోడించి ప్రతాపరుద్రుని రాజ్యమునకుఁ దీసికొనివచ్చిన యుంగధరునిప్రతిభ గమనింపఁదగినవి.

శాశ్వతానందంబు సమకూడునీకింక
నకలంకస్వర్గసౌఖ్యంబుగలుగు

ననికృష్ణుఁడుదీవించెను. బలరాముఁడింతతో నూరకుండకరాజ్యాంతమందున రాజైన ధర్మంబు సోదరతతితోడఁజొచ్చుగాక నరకంబు అనిశపించి సుయోధనునిదీవించి వెడలెను.

ఈ కావ్యమందలిశైలి సరళముగను నిర్దుష్టముగనునున్నది. అచ్చటచ్చట రసవంతములగు పట్టుల రసస్ఫురణమునకు చర్వితచర్వణముగా నొకభావమేవచ్చినను నయ్యది రసోద్రేకముఁగల్గించుచుండుటచేఁ బునరుక్తి దోషమారోపింపవీలులేదు.

తనపక్షమునసుంచు ఘనతయుకీర్తియు
మఱి లాతివారికి మసినిఁబూయు

తనపక్షమునసుంచు ఘనజయాదులనెల్ల
పరుల కపజయంబుఁ బ్రాప్తిఁజేయు.

నవరసములలో నిందుఁగాననయ్యెడిదివీరరసము. సాధారణముగా వీరరసప్రధానమగు నాటకములు కాని మఱేకావ్యములుకాని ప్రస్తుతమునవ్రాయఁబడుచుండుటలేదు. శృంగారరసనిమగ్నమగు నాంధ్రలోకమునకు వీరరసైకకావ్యమగు సుయోధనవిజయ మపూర్వముగఁ దోపకమానదు. రుచింపకపోదు. శ్లాఘనీయముగా నుండకపోదు.

ఈకావ్యమున నున్న రక్తి (Interest) వలననే యిది యమూల్యమయినదని చెప్పవచ్చును. పఠించుటకు మొదలిడిన చివరంటఁజదివినఁగాని విడువ మనసొప్పదు. నాకు మాత్రమట్లున్నది. విషయము నూతనము. రచననూతనము.

అప్రతిమానసాహసముతో నీనాటకమును రచించిన శ్రీ కోటమర్తి చినరఘుపతిరావుగా రాంధ్రలోకమునకు వంద్యులు.

భారతకూలంకషవ్యాఖ్యానరచయితలగు మహామహులు, మహాభారతమీమాంసకర్తలగు విద్వాం

నులు, భారతపరిశోధకులగు పండితులు, ననేకులున్న పుడు ఈ సుయోధనవిజయమునకు నేను పీఠికవ్రా యుట వింతయె. అయినను నా యోపినకొలఁది యీ గ్రంథమునకు ప్రశంసక విమర్శనము వ్రాసినాఁడ. ప్రా జ్ఞులు మదీయావజ్ఞతల మన్నింతురుగాత !

కాకినాడ.
20-7-27

గరిగిపాటి రామమూర్తి. బి. యే.

---

వరా:— కొన్నిప్రతులలో 28 వ పేజీలో 12 వ పంక్తిలో అంబికకు మారుగ నంబయని పొరపాటునఁ బడినది.

శ్రీరస్తు

# సుయోధనవిజయము.

నాంది

ఉ॥ కౌరవపాండవప్రతతి కారణమున్గొని భూమిదేవి కీక్ భారముఁబాపగా మదిని పంతముపట్టి నరేంద్రుమ గిట్టి యే క్రూరమొ మంచియో పుడమికోమలిఁ గీర్తియు పాండు పుత్రభూపీరులకిచ్చి మెప్పుగను విష్ణుఁడు సభ్యులనోముగాపుత్క్.

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించి)

సూత్ర:-ఓనటీ ! ఇటురమ్మ

నటి:-ఊరక పిల్చితిరా ?

సూత్ర:-ఏమి ? ఊరక రమ్మనుదునె ?

నటి:-కాకున్న నిప్పుడేకద నేనుబోయితి నింతలోనే పనియేమి గలిగె ?

సూత్ర:-ఊరక కోపించుటొప్పునే. పనిగల్గియే ని న్నుఁ బిలిచితి.

నటి:-ఏమిపనియో సెలవీయవేడెద.

సూత్ర:-చెలి! యిటుచూడుము. ఈ సభాసదులంద రేల వచ్చియుండిరో యెఱుగుదె?

నటి:-ఓహో! తిరిగి వీరికై నన్ను రమ్మంటిరా?

సూత్రి:-లతాంగి! నిజమందులకె నిన్ను నేఁబిలచినది సభాసదుల హృదయపద్మములను వికసింపఁజేయు నవీననాటకరాజ మేదియైన నొంకగ్రహించి యిపుడె యాడదలఁచితిని.

నటి:-ఓ నట్లుచేయవచ్చును కాని మీరు దేనిని గ్రహించి యాడనెంచితిరో నే నరయఁగ వచ్చునా?

సూత్రి:-నీ సహాయ్యముఁగోరి నిన్నుబిలువ అరయగవచ్చునా యని యడిగెదవేల? వెలఁది! సుయోధన విజయమనెడి యొకక్రొత్తనాటక మొకకవి విరచియించె

నటి:-ప్రజలు సుయోధనవిజయమనిన ఆసుయోధనుఁడేడ? ఆహవమున గెల్చుటేడ? సత్యేతరంబిదియంటంచు తలఁచెదరేమొ?

సూత్రి:-ప్రిదర్శనమును వీరు శాంతమునగను మరి సాంతముగను నరసిన దప్పక ననుమానములు తీరు సత్యము గ్రహియింపజాలుదురు.

నటి:-మహాభారతచరిత్రమంతయు నేటి కసత్యమై యొనగుటసంభవంబు, వ్యాసుఁడంతటికవిపక్షపాతంబున పాండుపుత్రులకెల్ల బవరమందుజయమయ్యె కౌరవ సంతతి కపజయమును గల్గె నని సత్యమును మఱుంగు

బెట్టి యసత్యము నిట్టులఁబ్రకటించెనని దెల్ప వినువారు నరయువారు నవ్వరే. మంచిదీనాటక మాడుటకంటె బ్రదర్శింపకుంట మేలు.

సూత్ర:-పాండవవంశంబువాఁడైన జనమేజయుని రాజ్యపాలనమునఁ లిఖింపఁబడినట్టియీ మహాభారతంబున గవి యీ రాజవంశీయులందున్న గోరంతధర్మము కొండంత పెద్దజేయుచు సుయోధనుని మహోన్నత గుణములను మరియు ధర్మములను మరుఁగుఁ బెట్టెననిన యసంభవంబగునె? చెలియ!

నటి:-పోనిండు. మనకిప్పు డితివృత్తముఁ గూర్చి వాదించుకొననేల? పండితవరులగ సభ్యు లీవిషయము నుగ్రహించి విమర్శించెదరు. కవి మాట?

సూత్ర:-కవియుమనకుపరిచితుఁడు. మనుచరిత్రము పై శశాంకవిజయముపై సరసమైన ఖండనముల వ్రాసి గణుతికెక్కె. మరియు నతఁడు ప్రతాపసింహాయను నాటకమొకటి రచియించె. కాన నతని కావ్యమిప్పు డుసభ్యులకింపుఁగూర్చు.

నటి:-అతఁడా! మనబ్రహ్మయార్యుని యల్లుఁడు కోటమర్తి చినరఘుపతి. తెలిసె:—

# IV

సూత్రి:-తన్వి! దానినిటఁ బ్రదర్శించి మెప్పొందవలె గాన నీవు సత్వరముగఁజని నటకుల కిదిచెప్పి నాటకము సిద్ధపరుపుము నే పోయివచ్చెద చెలి.

నటి:-ఈరీతి నాటక మీసభ్యులకు మోదమొన గూర్పలేదేమోయని తలఁచెద.

సూత్రి:-మంచిచెఱుకుల రెంటిని యెంచిచూపు
నిట్టి కావ్యంబు సభ్యులనెట్టయెదుట
నాట్యమొనరించి చూపిన నాతి వీరు
సంతసింతురుగాని యసహ్యపడరు.

[సభ్యులపైఁ బూలఁజల్లి నిష్క్రమింతురు.]

శ్రీరస్తు

# సుయోధనవిజయము.

ప్రదేశము :- ద్వైపాయనహ్రదప్రాంతము.

ప్రవేశము:— సుయోధనుఁడు. పాండవపంచకము.
కృష్ణుఁడు. బలరాముఁడు.

—:సుయోధనుఁడు:—

దేవకీనందనా ! తీవ్రఘాతంబునఁ
దెగిపడు ననుజేరి వగపుదక్కి
నీయంత్యవాక్యముల్ నే వినఁగోరితి
ననిబల్కితిని యిదె యాలకింపు
భారతయుద్ధంబు ప్రభవించె నీమూల
మున, పాండుసుతులు నేమును దలంతు
మీవ కారణమంచు, నీవ ఘనుండవు
రాజ్యాంగవేత్తవు, రాజ్యమెల్ల
నెట్టులైన పాండుభూమీశుల పాల్జేయు
కంకణంబును నీవ గట్టుకొంటి
సూదిమోపినయంత చోటైన లేనట్టి
పాండురాజులకీవు భరతవర్ష

మెల్లనొసంగితి, వీప్రతిజ్ఞ నీకగు
నీ చేతిలావున నిగ్రహింపఁ
బడితిని, పాండుభూపాలబలమును నే
బాటింపగాలేదు, వారు ఖలులు
అన్యాయశీలురై యక్రమయుద్ధంబు
జేసి నన్గెల్చిరి, సిగ్గులేక
సింహాసనంబెక్క సిద్ధమైయుండె నీ
ధర్మసుతుఁడు రేపు, తనదు ప్రతిజ్ఞ
విజయకారణమంచు విఱ్ఱవీగెడు, నీవు
కయ్యంబులో నన్ను కడకుదెచ్చి
ధర్మజు కిడఁ గూడదు తగుదని భుజియించి
రాజ్యమేలగనున్న ప్రభు వతండు
నాచేతనో గాక నీచేతనో భువి
భరణంబు గ్రహియించు బ్రదుకెగాని
భుజబలోపేతుఁడై పోరొనర్పఁగ గెల్చు
కొను కూడు తిన నోచుకొనఁగలేదు
అట్టి యభాగ్యుల కంతశక్తియు నీవు
ధారపోసినది వ్యర్థంబుసుమ్ము
ధర్మజుం డితఁడంచు ధర్మరాజంచును
బిలువంగఁబడు మాయవేషమునకె

ధర్మంబునుండి యధర్మంబు బుట్టును
వెలుఁగువలన నుద్భవించు తిమిర
మతిశయశృంగారమందు వైరాగ్యంబు
వనదంబుల నశనిపాతములును
పరిభవించుచుండ, సంభవముగాదె యితని
యాహ్వాయమది వృషయోట కృష్ణ!
విరటుకొల్వున వీరు వేసిన వేషముల్
సహజంబులై యొప్పసాగె, గాన
బ్రహ్మభేద్యంబుగా బ్రిదుకంగఁగల్గిరి
యజ్ఞాతవాసదీక్షాంత మందు
వఱకు, నీనాఁడు నీపటిమచే జయమంది
యును, వారు రుద్రభూమిని గ్రహించి
యేలుకొందురుగాక; యిక్షురసంబెల్ల
నే గొర్రెల తచ్ఛేష మీ నృపాలురకు
రకుఁ జేరె, భళిరె! యీ ప్రభువుల యేపున
కదె చాలు కాఁబోలు, నంతయేల
సకలవేదంబులఁ జదువుచు దీక్షతో
జన్నంబు లెన్నొని జరుపుకొంటి
ధనలక్ష్మి దరిఁజేరి తాండవం బాడుచు
నవని నృపతుల జోహార్లఁగంటి

జనుల నాజన్మాంతమును నేను రారాజు
నై యేలి మన్నన లందుకొంటి
దుర్మదశాత్రవదోర్బలగర్వని
ర్వాపణంబొనరించి ప్రతిభఁగంటి
శాత్రవతతిచేత క్షత్రియాగ్ర్యంబైన
మరణంబుఁ గననుంటి మురియుచుంటి
మిత్రబాంధవ్యులతో మేదిని విడనాడి
స్వారాజ్యమేలంగఁ జనుచునుంటి
నట్టి నాకు మరి మీ యుత్కృష్టులకు నెన్న
హస్తిమశకభేదమరయఁ గలదు
ప్రభవమందినదాది పాండవుల్ శ్రమలొంది
వనములఁ బదిరెండు వత్సరములు
తలఁదాచుకొని తుద ద్రౌపదితోఁ గూడి
యజ్ఞాతవాసంబునందు నుండి
యుద్ధంబునందున యోధానయోధుల
బంధుమిత్రాదుల భవ్యుల గురు
వుల పుత్త్రులను గోలుపోయి తమ రథగ
జాశ్వపదాతిసైన్యంబులెల్ల
తుత్తుమురులుగాగ పెత్తనంబులను కృ
శించు విధవలపైఁ జేయువారిఁక.

—: కృష్ణుఁడు :—

అనిలోన జయమందు టదియెల్ల ధర్మంబు
కావున ధర్మమే కడకు గంటి
ఘోరపాపాత్ముల క్రూరుల నేగతి
నైనను దండింప నగునుగాన
పాండవులను నీవు పరిభవించినయట్టి
పాపివౌట నని నీపాట్లు గలిగె
భీముని బాధించి విసమిడి జంపగా
నీరంబులనుద్రోయ నేరమయ్యె
మాయజూదంబున మహినెల్లగాంచంగ
నన్యాయమార్గమం చనగనగును
పాంచాలి దలపట్టి పదిమందిలో నీడ్వఁ
దగదని వారింపఁదగదె సభను ?
వనవాస మజ్ఞాతవాసంబులకునెన్న
కారణంబైనట్టి ఘనుఁడవీవ
కావున నీయెడఁగావించు కార్యంబు
లెవ్వి, యధర్మమై యొసగవెపుడు
తగు నధర్ముల నెప్డు తగ నధర్మవిధుల
శిక్షింపఁజేయుట చెల్లుగాన

ధర్మయుద్ధంబులో ధర్మమార్గంబున
దండించి నిను వారు ధరనుగాంచి
రనిలోన దెగితివి యంత్యంబునందుంటి
వనఘుల నిందించు టఘుసుగాన
నంత్యమందైన నను నఘుమూలఁజేయక
ధర్మపరతనున్నఁ దసరు సుఖము.
అనిలోనఁ గూలితివను రోషమును వీడి
ధర్మంబువలుక సంతసముగాంతు
దైవముఖముఁజూచి ధర్మంబు వలుకుము
కొంత శాంతము నమకూర్చుకొనుచు.

—: సుయోధనుఁడు :—

చిత్తశాంతత నాకు చేకూరె నిప్పుడు
సర్వసత్యంబులనిర్వచింతు
పాండవపక్షంబువాఁడవే యైనను
ధర్మంబు గ్రహియించు దలఁపుగలిగి
తత్పక్షముననుండి దఱలుచు నొకకొంత
ధర్మబుద్ధిని దాల్చి దనరుచుండు
పక్షపాతంబుచే వర్ధిల్లదు నిజంబు
పక్షపాతి కెట దృక్పథము వేఱు

ఏకాక్షిదృక్పథ మేనాఁడు సరికాదు
వానిగతినిఁజెందు పక్షపాతి
ప్రకటధర్మాధర్మపక్షంబులనుగాంచి
ధర్మంబు దెల్ప నుద్యుక్తుఁడైన
ప్రభువెప్డు నుభయులపక్షంబులనుగాంచి
ధర్మంబు దెల్పఁగాదగును గాని
యొకపక్ష మాలించి యూరకుండెడువాఁడు
తీర్పరికాఁగ యత్నింపరాదు.
ఒక పక్షమునుదాల్చి యుర్విపై కెగయంగ
యత్నించి బరువిడు నండజంబు
లేమార్గమునగాని యెగురంగలేనట్లు
పక్షపాతియు ధర్మపథము గనఁడు
ఉభయపక్షంబుల నూతను గ్రహియింప
ధర్మమార్గంబునఁ దరలనగును
పాండవపక్ష సంబంధములనువీడి
నన్ను నీవానిగ నెన్నుకొనుచు
నాపక్షవాదముల్ న్యాయమార్గంబులై
వర్తించుచున్నవో, బాసి యక్ర
మంబులై ధర్మేతరంబులై యున్నవో
విని దెల్పుమపుడు సవిస్తరముగ.

భారతవర్షంబు పాలించు పతిలేమి
వ్యాసమహర్షిచే వంశజులను
బడయంగనెంచి మావార లంబికయను
నా పితామహిఁ బంప నాటిరేయి,
పరిభవించె మాతండ్రి వారికి, జాత్యంధ
తాదోషమునజేసి తండ్రికపుడు
రాజ్యార్హతనశించె, రాజుగావలెనంచు
కోరికదళుకొత్తఁ గొడుకుఁ బడయు
మనిజెప్పి యంబాలికనుబంప పాండురా
జుద్భవించెనుగాని, యొడలు పాండి
మముగల్ల నతఁడును మహి నేలరాదంచు
ధర్మసందేహ ముద్భవమునొందె
కావున మావారు కడ కంబికనుదెచ్చి
తనయునిఁ బడయుమంచనుప నామె
మునిపతిఁజేరక తనదాసిఁబనుపంగ
వారికి విదురుండు పరిభవమందె
నన్యయోనిజుఁడెన్న నవనినిభరియించి
పాలింపరాదంచు పలికిరపుడు
కావున రాజుగా కడవాని దప్పించి

ధృతరాష్ట్రపాండుసుధీనిధులను
నొక్కనిజేయంగ నుత్సహించుచు వార
లుభయులు దగ ననర్హులనుచుఁ దుద
నగ్రజన్ముండౌట నధిపతి ధృతరాష్ట్రుఁ
డౌనంచు వచియించిరపుడు, వారు
పాండురాజునుబిల్చి ప్రభువైన ధృతరాష్ట్రు
పాలనంబుననుండి వానికీవు
సైన్యాధికారివై సంరక్షణముసేసి
వినయవిధేయత్వమునఁజరించు
మనుచు దెల్పిరి, కాన యజ్ఞాదిక్రతువుల
నాచరించెడివేళ నధికభక్తి
దిగ్విజయంబులఁదెచ్చినధనరాశి
మాతండ్రికిచ్చెను మహితయశుఁడు
అగ్రజన్మునిఁగొల్చి యధికసుఖంబున
పాండుభూపతి దివిఁబడసె నంత
పదపడి పాండవుల్ పాలుపంపులటంచు
బాధింపఁదొడఁగిరి వారుమమ్ము
కలకాలమునుండి కౌరవరాజ్యంబు
పాలుపంపులు లేక ప్రబలుచుండె
నవిభక్తరాజ్యంబుగ విరాజిలుటఁజేసి

పాండవు లీనాఁడు పాలుఁగోర
కౌరవరాజ్యంబు ఖండంబులనుజేయ
ధర్మవిరుద్ధమై దనరుగాన
పాండవపతులకు పాలీయకుంటయే
పరమధర్మముగాదె; పాండునృపతి
యే గోరలేనట్టి యీ రాజ్యభాగంబు
పాండవుల్ గోర నద్వర్తనంబె
అవిభక్తరాజ్యంబు నందుండి యర్ధంబు
పంచియిచ్చిన మాకు పాడియగునె
పూర్వమర్యాదలఁ బూజింపవలె ప్రజ
పోషింపవలె రాజు, పూర్వవిధుల
ధర్మంబు బాటింపఁదగునెప్డు, సోదరు
లకు నొకనూత్నధర్మంబుగలదె?

—:సహదేవుఁడు:—

దాయభాగవిభాగధర్మంబులకునేమి
భీమునిబాధింప వెడలుటెల్ల
ధర్మంబె నీకు?

—:సుయోధనుఁడు:—

అధర్మముకాదది
పిననాటనుండియు వేవిధముల
నవమానితులఁజేసి యులయించె మమ్మెల్ల

బలశాలి తానని ప్రబలగర్వ
మునునుండె, నయ్యాటలనువంక బాధితా
త్ములఁజేయ సహియింపఁదలఁపులేక
భీమునిఁ బరిమార్ప విశ్వప్రయత్నముల్
చేయుట దోసమై చెలఁగగలదె.
ఎన్నెన్నివిధముల నీభీము జంపింప
యత్నించినను చావునందఁడయ్యె
చేసినయత్నంబు శిథిలమైపోవంగ
రోషంబు పెల్లుబ్బె రూపుమాప
పరిభవదావాగ్ని ప్రజ్వరిల్లుచునుండ
భరియించి నరుఁడిల బ్రదుకలేఁడు
రాజవంశంబునఁ బ్రభవించియును నేను
పరిభవంబునుబొంది బ్రదుకఁగలనె ?
ఈరణంబునకద్ది కారణంబని యెట్టి
ప్రాజ్ఞులైనను దెలుపంగలేరు.

—: నకులుఁడు :—

భీముని బాధించువిధమున కేమయ్యె
ధర్మజు యువరాజు దగ గొనర్ప
నీ తండ్రితలపెట్ట నీవు వారింపవె

కూడునే నీకిట్టి కీడు సేయ
పితృపితామహులచే భృతపూర్వమై క్రమా
గతమైన రాజ్యంబు కరమునెమ్మి
బాండుసుతజ్యేష్ఠు పాల్జేయకుండుట
ధర్మవిరుద్ధమై దనరుగాదె ?

—: సుయోధనుఁడు :—

కురువంశజులకెల్ల మరి ధర్మజుఁడె జ్యేష్ఠుఁ
డనుమాట నిర్వివాదాంశమెపుడు.
మును కురువృద్ధులు మొదట మాతండ్రిని
రాజుగా జేయంగ రహినిజెందె.
పాండురాజును తన బలపరాక్రమములఁ
గెలిచి తెచ్చినభూమి చలమునఁగొను
కప్పంబులెల్ల నగ్రజునకు వినయవి
ధేయత్వమునను భక్తిని నొసంగె.
కావున పితయు నఖండరాజ్యంబున
కును రేడుగానుండి జనులనేలె
నాచక్రవర్తికి నౌరసపుత్రుండ
యువరాజు నేనౌదు నుర్వినేల.
ధర్మజుండిక నగ్రతనయుండు పాండురా
జునకుగానఁ నతఁడు తన జనకుని

సాత్తునకెప్పుడు పెత్తనంబునుగల్గి
వర్తింపవచ్చును, పాండురాజ
పుత్రులు ధృతరాష్ట్రభూమికి దాయాదు
లెన్నడు కాజాల రిదినిజంబు.

—: అర్జునుడు :—

మీసర్వరాజ్యంబు మేము గోరగలేదు
నీకెగ్గు దలఁపంగనేరలేదు
అన్నదమ్ములమయ్యు నరయక మమ్మావు
పొంపంగఁజూచుట యొప్పునొక్కో ? 115
లాక్షాగృహంబున నంపిల్లపావక
జ్వాలల మమ్మెల్ల జంపఁదలఁచి
తలఁచినకార్యంబు తప్పిపోయెనటంచు
మాయజూదంబున మహి గ్రహించి
యాధికబాధల మమ్ము నలయింపఁజూచితి
వదియును ధర్మంబె యనెదవీవు !

—: సుయోధనుఁడు :—

పిననాటనుండియు భీముని చేతిలో
బాధింపఁబడితిమి పలువిధముల
భుజబలంబునమించి నిజశక్తి నన్గెల్చె

కావున క్రోధంబు కడలుముట్టె.
పగ బుట్టరాదెప్డు ప్రభువుల మధ్యను
పగఁ దీర్చుకొనిగాని ప్రబలరాదు
పగఁ గల్గువారలు ప్రబలుచుండెదరేని
పామున్న యింటిలో బ్రబలుటయగు
పగను సాధించి స్వేచ్ఛగబ్రదుకంగనౌ·
సాధింపలేకున్న సమయునగును
బలహీనుఁడగు శత్రువధియింపననువగు
బలవంతుతో బోరవలనదెపుడు
శాత్రవ్యం డెప్పను సముఁడౌట ధర్మంబు
శత్రుఁడె లేకుంట చాలమేలు
అధముఁడైన విరోధి నన్నిమార్గంబుల
దండించుటెల్లను ధర్మమొందు
నాత్మరక్షణమెప్పు డన్యాయమనరాదు
నా క్షేమగతినేగ నాకె తగును
పగతుండు భీముండు పగగల్గె నామది
పగతుని దునుమాడఁదగును గాన
కలిగిన సర్వమార్గంబుల వధియింప
దలఁచుట మాకెప్డు తప్పుగాదు

ఈ భీముబాధింప నిదె కారణంబెందు
నతనికి తోడైన నందరంతె.
మాయజూదంబనుమాట యసత్యంబు
ఇది మాయయని మీకు నెపుడుతోచె
జూదంబునకుముందు శోధించి పాచిక
లాడంగవలసె మీయన్న యపుడు
తనచేత పాచికల్ తానె గ్రహించియె
తాఁ జూచుచుండంగ దానెయాడె
తన కోటమిగలిగెనని జెప్పె తాఁదెచ్చి
సర్వంబు మాచేత జిక్కనుంచె
నొకయాటయోడిన నూరకుండక తాను
చివరంట నాడంగఁజెలఁగె నతఁడు
పన్నిదంబులనుంచి పలుసారు లాడంగ
నోడిపోయెనుగాని యుత్సహించె
నాటగెల్చిన దాను నఖిలరాజ్యంబుల
గ్రహియించి యేలుకోగలఁడె యపుడు ?
ఆట యోడుటఁజేసియనుచితద్యూతమై
తాఁగెల్వ ద్యూతంబు ధర్మమగునె

—:భీముఁడు:—

జూదంబు మాటకు సోదెఁజెప్పితి చాలు
నా నుడివిని సమాధానమిడుము

ధరఁ బతివ్రతయన ద్రౌపదికే చెల్లు
పరిభవించుటనామెఁ బాడియగునె ? 140

—:సుయోధనుఁడు:—

అరయుము తద్విషయంబెల్ల నెఱిఁగింతు
ద్రుపదరాజేంద్రుఁడు ద్రౌపదికి స్వ
యంవరపరిణయం బాచరింపఁదలంచి
యఖిలరాజన్యుల నర్థిఁబిలచె
బ్రాహ్మణవేషముల్ వఱలంగ మీరేగ
క్షత్రియార్హంబుగఁ జనితిమేము
మత్స్యయంత్రంబును మహిఁగూల్చె నరుఁడంత
ద్రుపదరాజేంద్రుఁడు ద్రౌపదిగన
సితపుష్పదామంబు చెలువ ద్రౌపది తెచ్చి
యర్జును కంఠంబునందు నుంచె 145
దాన యర్జునునకు ద్రౌపది భార్యయై
వెలయుట యేరికివింతగాదు
అర్జునుండట్టుల నతివను గొనిరాగ
పాలుపంపకమయ్యె పడతియపుడు
ఏధర్మ శాస్త్రంబు లీయింతి యుద్వాహ
మున ననుమతి నిడవనుట నిజము

ఏదేశమందున నిట్టి యాచారంబు
కలదని జెప్పంగఁగడఁగ రెవరు ?
స్మృతులందు శ్రుతులందు జెప్పలేదీ వివా
హముఁగూర్చి శాస్త్రదూష్యంబుగాన
ఆశంకలకు నేమి, యర్జునుండప్పుడు
ద్రౌపది గొనిరాగ దన్విఁ జూచి
మోహవిభ్రాంతులై ముగురను బెండ్లాడ
మదినెంచి దానికి మాతకార
ణంబంచు దెల్పుట న్యాయంబె మీకు ? నే
విధమున ద్రౌపది బెండ్లియాడ
నర్హతగాంచితి ? రదియెల్ల ధర్మప
థంబంచు దెల్పఁగాదగునె మీకు ?
మత్స్యయంత్రంబును మరి మీనసోదరు
లొకసారిగొట్టిరే యుర్విఁబడగ
పుష్పమాలలఁగొంచు పూఁబోడియొకసారి
యేవురిగళముల నిడెనె యవుడు ?
ద్రోవదినిడనెంచు ద్రుపదరాజేంద్రుఁడు
పంచపాండవులకు బడఁతినిడెనె ?
అట్టియెడల మీర లాయింతి హస్తంబు
గ్రహియించినార లేకారణమున ?

భిక్షయటంచు నివేదించితిరట మీ
తల్లితో నప్పు డధర్మ వృత్తి
బిక్షగా నిడెనొక్క వెలదిని మీమామ?
బిచ్చంబుగా మీరు దెచ్చుకొనిరె?
అనిగెల్చి తెచ్చిన యతివ బిక్షంబౌనె?
మనుజుల బిక్షంబు మహినిగలదె?
వెలదిని దెచ్చుచు బిక్షం బనుచు దెల్ప
నాయసత్యం బేరి నందగలదు?
భిక్షయనఁగ దల్లి విభజించుకొనుఁ డనె
చెలువయనఁగ విభజింపుఁడనునె?
సత్యవ్రతంబునఁజను ధర్మజుం డప్డు
సనృతంబులాడిన విని కటకట
పడెనొక్కొ? యనృతంబు వలికిన సోదరు
లనుగాంచి గర్హింపఁజనెనె యపుడు?
అనృతఁబులాడుట నతివపొం దొనగూడ
వలదని వారించి బలికినాడె?
గురువచనంబంచు శిరము దానొగ్గుచు
నాయింతి పొందును నందెకాని
ద్రుపదుండు నతినీయఁ దొలుత నెవారింప
నగ్రజన్మువివాహమైనఁగాని

యర్జునుండు వివాహమాడంగరాదంచు
సాకొండు గల్పింపఁజాలిరప్పుడు
మత్స్యయంత్రంబును మహిఁగూలనేసెడు
వాఁడెన్న ద్రౌపది పాణిఁబట్టు
నని మీరు వినియును నగ్రజన్ముండైన
ధర్మజునకు బత్ని దాలభింప
లేదు గావున మీరులేమ ద్రౌపదిఁగెల్వ
ధర్మజుఁబంపంగ ధర్మమగును
అప్పుడు ధర్మజుం డానాతిమన్నన
లందుకో గలిగిన నాలతాంగి
పరిణయుంబాడుట పాడియాగాని, తాఁ
దివిరి బాణంబు సంధింపలేక
మిన్నకుండిన యప్డు మెలఁతపై నాసచే
నర్జునుం డాయంత్ర మవనిఁగూల్చె
అప్పుడానాతికై యందరు సిద్ధమై
పరిణయం బాడుట పాడియగునె ?
చాన వివాహంబు క్షత్రియార్హంబైన
యా స్వయంవరవిధి నగునుగాక
మీతల్లి యాజ్ఞయు మీకల్లధర్మముల్
సాఫుగాజెప్పి యాచానఁ గొనుట

ధర్మపథంబౌనె? ధరనిట్టివే స్వయం
వరవివాహవిధులు? వానికేమి
అరయ స్వయంవరం బాద్రౌపదికిఁ దగు
గాని ధర్మజునకుఁ గాదు, కాన
నానాతితాఁగోరు నర్జునున కొసంగి
పరిణయం బొనరింపఁ బాడిగాని
మీాయింగితంబును మెఱఁతకు దెలుపక
నామె యభీష్టంబు నందకుండ
వనితఁగాంచిన మీారు వరియించి యేవురు
పరిణయం బౌఁట పాడియగునె?
ధర్మంబు నరసిన ద్రౌపది ద్రుపదుత
పంబుచే నగ్నిని ప్రభవమందె
ద్రోణుని వధియించు ద్రోణారి యొకనిని
జన్మని బెంపొందు చెలువనొర్తు
బడయంగ దలఁచి నృపాలుండు తపమును
జేయంగ వానిని శివుఁడు మెచ్చి
తగు వరంబులనిచ్చె, దాన ద్రుపదరాజు
గన సుతుని సుతను, కాన వాని
తపమునఁబుట్టిన తన్వి యాఫల్గుణు
నకు భార్యయై యుంట న్యాయమగును

ఆరీతిగాకుండ నానాతి ధర్మజు
కర్ధాంగి యౌటచే నబలజన్మ
కారణం బెన్న భగ్నంబుగాఁ జొచ్చె,నా
శివునివరంబులు జేరఁబదను
శైవనిర్దిష్టంబు తప్పె నీనాటికి
పురుషప్రయత్నంబు భువిని గెల్చె
పాండుసుతు లొనర్చు పాపంబులందెల్ల
నగ్రగణ్యంబయ్యె నతివ గొనుట
వారిమాట లటుంచి పరమపతివ్రత
యనిజెప్ప ద్రౌపది యద్భుతంపు
చరితంబు దెల్పెద సావధానంబుగ
పూర్వవృత్తాంతంబు పొలుపు వినుఁడు.
పూర్వజన్మంబులోఁ బొలఁతి మౌద్గల్యుని
భార్య యాయెనటంచు వ్యాసుఁడనఁడె?
అప్పుడామౌద్గల్యుఁ డధికరోగంబున
బాధ లొందుచునుండ పడతి యవ్వను
వానిని యుపచార వర్తనాదికముల
దనుపంగ సంతసమున నతండు
నీవు కోరెడి వరం బిచ్చెద గైకొను
మనిదెల్ప కాంతయు మదినిమెచ్చి

కామరూపంబును గ్రహియించి కామభో
గంబుల నొనగూర్ప కాంతకోరె
మౌద్గల్యుఁ డక్కాంత మదిగల్గు కోరిక
లొనరించి తుష్టుఁడై యుర్వి విడచె.
కాని కామిని దృష్టిగాంచంగలే దప్పు
కామజితయనంగ కాంతకు తగు
కులకాంత కామంబు గెలువంగవలెగాక
యీకీర్తి కామార్తి యింతికగునె?
మరియొంకజన్మంబు మానిని తాదాల్చి
కామంబుదీర్చెడి కాంతునికయి
యీశుని బ్రార్థింప నెసగెను, తుచ్ఛమౌ
కామంబు దీర్చెడి కాంతునికయి
యేనాతి బ్రార్థింప దీశుని యేనాఁడు
అందులకై జన్మలందరెవరు.
ఈకాంత ప్రార్థనలీశుండు వినుచు సా
క్షాత్కరింప, మగువ సంభ్రమమున
పతిపతియని తాను పలుసార్లు పలవించె,
భగవంతు దర్శనభాగ్యమబ్బ
మోక్షంబు గోరక ముగుదయు కామార్త
యై తాను పలవింపనగునె? శివుఁడు

దయగల్గి తన్వికి దర్శనంబిచ్చిన
చిత్తశాంతంబును జేర్చుకొనక
సంభ్రమింపఁ దగునె, సాక్షాత్కరించిన
శివుఁ డీమెవాక్యముల్ జేరి వినఁడె ?
భగవంతు దర్శింప భక్తియు భయమును
ప్రేమయు విడనాడ వెలఁదికగునె ?
కామాంధురాలైన కాంత యీమెయటంచు
వనితకు నలసిన పతుల నొసఁగె
దానిచే మీరలు తన్వికి పతులైరి
కాంత కామార్తిని గడవబెట్ట
ననుచు వ్యాసుఁడు దెల్పె యతివచరిత్రంబు
నత్యద్భుతంబుగా నలరుదాని
ఇహలోక సౌఖ్యంబు నింతి పీడగలేక
మూఁడుజన్మంబుల ముగుద దాల్చె,
నింద్రియంబుల గెల్వ నెఱుగని యీకాంత
మీతోడ పొత్తుండి మెలఁగగలదె ?
ఈలేమ కామార్తి యెఱుగదు తనహద్దు
విశ్వనింద్యంబుగా వెలయుచుంట
నంతకామార్తయౌ యతివ మానసమెప్డు
వ్యభిచరింపక యుండు టరుదుగాన

తగ పతివ్రతయంచు ద్రౌపది ననగాదు
కులసతి గాదట్టి కోమలాంగి.
తన స్వయంవరమందు దాఁగోరె నర్జును
నీరీతిబెండ్లాడె నితరపతుల?
తనప్రేమఁగోరెబాఁ ధర్మజున కొసంగి
పరిణయంబాడ సంబరముపడెనె?
పుష్పదామంబు నేపురుషుండు గ్రహియించె
నతఁడె భర్తయటంచు ననఁగదగును
కడమవారందఱు కాంతకు నుపపతు
లట్టివారిని బొందు నతివనెపుడు
తగ పతివ్రతయంచు ధర్మజ్ఞులాడరు
కులసతిగాదట్టి కోమలాంగి
అర్జున గోరుట యటులుంచిఁ ధర్మజు
పట్టమహిషియైన పడతియయ్యె,
జూదంబున నతండు సుదతినిగోల్పోవ
తనోడి నన్నోడఁదగునె యంచు
సభవారిబ్రశ్నింప సాహసించెను గాని
యప్రస్తుతంబని యరయ బోదు
పట్టమహిషి యయి ప్రజల పాలింపంగ
సిద్ధమైయుండెడి చెలువయెపుడు

పతితోడ కష్టముల్ భరియింప సిద్ధమై
యుండంగవలె గాని యూరకున్న
యతివ పతివ్రతయని ప్రాజ్ఞులెన్నరు
ఆనాతికులసతి యనఁగ దగదు.
కష్టకాలంబున గడగండ్లఁ బడలేక
ద్రౌపది యీరీతి దలచెగాక
బహుపురాణంబుల వనితలఁగాంచమే
వారెల్ల రీగతిఁ బలికినారె ?
ధర్మంబుగాదంచు దమయంతి బలికెనే
తనపతి యోడ జూదంబునందు ?
శ్రీరామచంద్రుని సీత వెన్నంటదే
ఘోరకాననమందు గ్రుమ్మరిల్ల?
లేమ చంద్రమతి హరిశ్చంద్రుతో నేగు
టన్యాయమంచు దాననియెనొక్కొ?
ధర్మజుం డానాఁడు ద్రౌపదినోడుచో
ధర్మేతరంబని తన్వి బలికె,
జూదంబునాటికి సుదతి ధర్మజునకు
నర్ధాంగియై యలరారుచుంట
మఱచెనో, పతియయ్యు మహి గోలుపోవంగ
ధర్మజు భర్తగా దలఁపఁబోదొ?

ఆరీతి తనభర్త నరసెడి కాంతను
కులసతి యన రెట్టికోలమువారు
ధర్మశాస్త్రంబందు ధర్మజుండెక్కడో
ద్రౌపది యెక్కడో ధర్మరతుల
కెరుగంగ రాదొక్కొ? యింగితజ్ఞకు పయి
యర్ధాంగి కీట్టుల నధికుఁడైన
భర్తయాజ్ఞను దాటఁ బాడియే, పదపడి
సభలోని భర్తను సాహసమున
నారీతిఁ బ్రశ్నింప నగునొక్కొ సతి కెందు
పతియాజ్ఞఁ దాటెడి పడతి నెందు
దగ బతివ్రతయంచు ధర్మజ్ఞులాడరు
కులసతి గాదట్టి కోమలాంగి.
తన్నోడి నన్నోడ ధర్మంబుగాదని
ద్రౌపదియనుట యధర్మమెందు
సన్యాసికిని బానిసకు నోడిపోవబ
డినవానికిని యిది తనది యనెడి
యధికార మావంతయైన నుండదనుట
జగమెఱింగిన యట్టి సత్యమయ్యు
లేమ చంద్రమతి హరిశ్చంద్రుఁడమ్మగా
చంద్రమతికి నెట్టి శాస్త్రసమ్మ

తంత్రమైన నధికారధర్మంబు లేమియు
నేరీతిసుతను లోహితుని గొంచు
బోవంగజాలెనో పూఁబోఁడి నారీతి
ధర్మజుం డోడంగదగును గాన
నువిదనైచిన ప్రశ్న ముత్తము దాంపత్య
లక్షణమందున లక్ష్యముంచి
చూచుచో నదియెల్ల చోద్యమై యప్రస్తు
తంబునై మరి యసభ్యంబునగుచు
నుండెనుగావున నువిద ప్రతివ్రత
యనిజెప్ప సాహసంబగును నెపుడు
అట్టిద్రౌపది మీరలందరు జేపట్టి
కులసతి యిదియంచు గొప్పచెప్ప
నాకాంత తనమేర నరయంగ లేకుండె
తనయంతవార లీధరణి లేర
టంచు మమ్ముల పరిహాసంబు జేసెను
మయసభాలోకనమయుల మాట
కులసతి యేనాఁడు తిలకించి యితరుల
పరిహాసమును జేయఁ బాలుపడదు
వానికి మఱఁదినై వఱలుచుండుటఁ జేసి
యారీతిఁ జేసె నంచనిన, నాఁడు

నాఫాలభాగంబు నవ్యమణిస్తంభ
మునను దగిలి నొవ్వ ముగుద జూచి
పరిహాసించెనుగాని బాధంవంబరిసెనే
యిదియెల్ల ధర్మమై యొసఁగగలదె?
పగవారు బాధింపబడినప్డు పరిహాసిం
తురుగాక, బంధువై మఱియు మఱఁది
మైయుండి బాధల నందెడు వేళల
పరిహాసమునుజేయ పాడియగునె?
అరయుడు మఱఁదిగా నతివయా సభగాం
నాయింతిఁ బూజింపనగునె సభను?
ఆమెకు నేనంత యాప్తుండనో నాకు
నామెయు నంతయే యాప్తురాలు
ఆనాటినుండియు నానాతిపై ద్వేష
మధికంబు గాఁజొచ్చె నాత్మ మీరు
జూదంబులో నోడ సుదతిని మావారు
రమ్మనిబిల్వంగ రాకనిలచె
బంధుజనంబుచే పరివృతగనైనట్టి
సభలోనికినిరాక చూనసిలచె
మానినిరాకుంట మావారలోర్వక
తివిరియామెను గొనితెచ్చినార

లప్పు డధోసీవియైనట్టి యాకాంత
వస్త్రంబుతనయంతఁ బడెను క్రింద
నంతమాత్రంబున నతివను పరిభవిం
చితిమంచు నెగ్గెత్తి చెప్పఁగకట
సిక్కంబుగ నిది మానేరమంచుదలంప
మరయంగ నిదియ యదార్థమెపుడు

—:ధర్మరాజు:—

అతివ ద్రౌపది నట్టులవమానమొనరించి
ధర్మంబటంచును దగునెబలుక?
దానికేమాయె సద్ధర్మరతుని కృష్ణు
ననఘుని స్వయముగా ననిపినార
మప్పుడు రాజకార్యార్థులమై మేము
రాయబారంబును జేయఁదలఁచి
అతని వాక్యంబుల నాలకింపక నీవు
బంధింపఁగడగుట భావ్యమగునె

—:సుయోధనుఁడు:—

కృష్ణుండు చెప్పిన గీతలనట్టుంచి
యాతని నరునిగా నభినుతింపఁ
గలిగిన సుగుణముల్ గణుతింపు మొకసారి
పోనిమ్ము, చేసినపుణ్యకృతము

లేవేనిగలిగిన నెరిగింపు గాకున్న
నాచర్య లెరిగింతు నరయుఁడిపుడు
ఆనాటిరణములో నంతమొందింపఁడే
హంసడిచకుల నన్యాయముగను
రాజసూయంబున రాజైన శిశుపాలు
నంతమొందించె నన్యాయముగను
భీమునితోగూడి వెడలుచు వధియించె
రూజరాసంధు నన్యాయముగను
కురువృద్ధు మనతాతఁ గరుణలేకయె జేరి
హతమొనరించె నన్యాయముగను
గురువైన ద్రోణుని ఘోరమార్గంబున
నరికించివైచె నన్యాయముగను
భూరిశ్రవశు జేరి బుద్ధిపూర్వకముగ
నవనిపై గూల్చె నన్యాయముగను
నాబహిఃప్రాణంబు నామిత్రుఁగర్ణుని
హత్యజేయండె యన్యాయముగను
ఎవ్వరిమాటలకేమి? నన్నీగతి
నందింపఁజేసె నన్యాయముగను
అట్టి వానిని వీర లధికుఁడంచు వచింప
బరిహాసంతురు పెరవారువిన్న

ప్రియముగఁ దరిఁజేరి చెన్నొందు హరియని
యితనిని గొండాడుట తగు మీకె
కాని యీకృష్ణుని కడమవారందఱు
హరియని యేనాఁడు నరయరేల?
తన్నధికుఁడటంచు నెన్ననిపరులపై
దండెత్తి వధియింపఁదగునె హరికి
హరియైన వక్రమార్గానువర్తిగ నున్న
ప్రజలు హర్షింప రేపాటియైన
నన్యాయశీలుఁడై యక్రమపద్ధతి
జనులబాధించుట పాత్రమగునె?
సాటిరాజుల యేపు సహింపలేమని
వారల బాధింపఁ బౌలుపడెను
ఈరీతి నవతారమెత్తునే హరియెప్డు?
హరియైన ధర్మంబె యాచరించు
తగ నధర్ముని యవతారపురుషుఁడంట
అధికదోషంబంచు నరయఁదగును
రాజ్యాంగవేత్తగా రాణించు కృష్ణుని
హరియని చెప్పగానగునె మీకు?
నధముల దరిజేరి యధికులఁజేయుట
ఘనకార్యమెప్పుడు, కానలేఁడు

మిమ్ములం దరిజేరి మేదినీవలయంబు
మీచేత గెలిపించి మీకునొసగె
నంతమాత్రంబున హరియని బిలచుట
ధర్మేతరబని దలంతుమెపుడు
రాజ్యాంగవేత్తయే ప్రభువైన హరియైన
నవని యమాత్యుండే హరిదలంప
నన్యాయపథమున నధికులంజేసె మి
మ్మతండు దుష్పథగామియై జెలంగి
కావున కృష్ణుని గణుతింపరెవ్వరు
మీరలు మరియు మీవారెగాని
శ్రీరామచంద్రుని జేరి వెన్నుండని
సాటివారలె నుతిసలిపిరపుడు
రాజ్యాంగ వేత్తయే రామచంద్రుండు, తా
నన్యాయపథముల నరిగెనొకో ?
సాటిరాజులంజూచి సహియింపలేమిని
పరరాజుల కతంబు బాధలిడెనె ?
ఋషుల యాజ్ఞలనంది యేలె నీభువినెల్ల
ధర్మమార్గంబును దప్పకుండ
చల్లనిపాలనసౌఖ్యంబు లభియించె
ప్రజలకు రామునివలన నపుడు

కావునరాముండు కల్యాణగుణమూర్తి
గా నెన్నఁదగు మహాఘనుఁడతండు
అట్టిశ్రీరాముని హరియని బిలువంగ
నగుగాక ; కృష్ణుని యనఁగఁదగదు.
రాయబారిగవచ్చి రాజునొద్దకురాక
విదురునియింటను విడిసెనతఁడు
వచ్చినవానిని పంక్తికి భుజియింప
రమ్మని బిల్వంగ రాక నిలచె
పదపడి యనరానివాక్యంబు లాడుచు
జేరి నామది నొవ్వఁజేసె నతఁడు
యేరీతిగానైన నీ సంధిపొనగూడు
నేమో యటంచు, నభీష్టమెల్ల
దానభగ్నంబునై దనరునేమో యంచు
వచ్చినదాదిగ పరుషవాక్య
జాలంబుచే మమ్ము చాల నొవ్వఁగనాడె
సంధి భగ్నంబౌట సంతసమున
వెడలె నతండును, ప్రియుఁడు మీకౌటచే
విరసోక్తులాడెఁ మావీట నపుడు
సంధిమాటలెలేక సాహసవాక్యంబు
లాడిఁ సంధి యేనాఁడు కాదు

రాయబారిగవచ్చి చేయుసంభాషణల్
ధర్మంబులై యొప్పు దనరవలెను
ఆరీతిగాకుండ నధికారరవముల
రాయబారముఁ దెల్పరాదు సభను
రాయబారంబు వ్యర్థంబునై సంధియే
స్వప్నగతంబునై వఱలుటెల్ల
రాయబారికి గల్గు ప్రబలలోపముచేత
గల్గుచుండును సర్వకాలములను
కావున కృష్ణుని కార్యంబు భగ్నమై
నిష్ప్రయోజనమౌచు నెగడెనపుడు
కార్యభగ్నముఁజేసి కౌరవలోపంబు
వెలిబుచ్చె మీచెంత, చెలిమిగూర్ప
వచ్చిన కృష్ణుండు ప్రాణమిత్రుఁడు గాన
వాని దోషము కనంబడదు మీకు
వాని కార్యముఁజూచి పండితలోకంబు
గర్హించుచుండె సంఘర్షణంబు
కలిగెనుగావున, కర్ణాదిప్రముఖులు
యోధానయోధులు నుర్విపతులు
నుభయపక్షంబుల నుండియు సమసిరి
వీరలేగ భువి నిర్వీర్యమయ్యె

నింత చేటునకెల్ల నీ కృష్ణుఁడే మూల
కందంబటంచు జగంబెఱుంగు
కావున కృష్ణునిఁ గట్టుట ధర్మంబె.

—:కృష్ణుఁడు:—

నన్నుఁ గట్టుట మీకు న్యాయమైన
నౌగాక ; వ్యాసమహర్షి ధర్మస్వరూ
పుఁడు మహితుండు మీపాంతకరిగి
పోరానగూడిన పొందేదు పెంపేదు
నని జెప్పె మీతండ్రి వినుచునుండ
నపుడైన సంధికి ననుమతించిన మీకు
సర్వశుభంబులు సంభవించి
యుండును, మూర్ఖత నూర్జితరాజ్యంబు
సర్వంబు నోడుట సంభవించె
వ్యాసుని నుడులకు భక్తివిశ్వాసముల్
జూపకుండుట మీరు చోద్యమయ్యె
వ్యాసుఁడంతటిఋషి పాండవపక్షపా
తంబునఁ దెల్పె నధర్మగామి
యని మెంచితివె నీవు ?

—: సుయోధనుఁడు :—

అది యెల్ల సత్యంబు

వ్యాసుండు పాండవపక్షపాతి
పాండవపక్షంబువాఁడ వీవన గల్గు
ధర్మంబు నీదు సోదరినిబట్టి
అంతియేకాని యా వ్యాసుండు పాండవ
పక్షంబునందుండ పాడిగాదు
కౌరవకౌలమున ఘనుఁడు గురువు గాన
నుభయపక్షంబుల నొక్కరీతి
నాదరించుటమేలు; ఆరీతిగావున్న
మౌనంబు వహియింపనౌను గాని
పౌత్రుల భేదంబుపాటింపరాదెప్డు
పెద్దవారలకద్ది ప్రీతిగాదు
పాండవపక్షంబు వారెవ్వ డతనికి
నాత్మబంధులుగారు, అరయ మేము
శాత్రవులముగాము, సర్వసంగత్యాగి
తానౌట మావివాదంబులందు
నూరకుండినమేలు, ఒక్కపక్షముఁ బూని
వాదింప నతనికి పాడిగాదు
కపిలగడ్డముదాల్చి కపిలజడలధరిం
చియు మునివృత్తని వెలుఁగునతని
శాలోకగతులను నరయుట మేల్గాని

కూటికి గుడ్డకు సీటుగాని
పోరాటముల నుండబోల దెపుడు; తానొ
క కుటుంబివలె మామకలహములను
పాల్గొనుటొప్పదు పక్షమొండుధరించి,
కనుక నతనిమాట వినగదగదు
ధృతరాష్ట్రు రాజుగా దొలుతఁ దాజేసియు
పాండవులకు రాజ్య భాగమందు
పాలీయవలెనంచు బలుక నధర్మంబు.
అవిభక్తరాజ్యంబు నందునుండి
పాలీయరాదను పరమధర్మము దాను
గ్రహియించియును గోరగడిగినాడు
కురువృద్ధు లీరీతి గోరరేనాఁడును
వ్యాసుండుదెల్పుటఁ బక్షపాతి
భీష్ముండు ద్రోణుండు విభజించిరాజ్యంబు
పాలిండటంచును బలుకరెపుడు ?
మిముజేరి వ్యాసుండు మీపక్షముననుండి
భీష్ముండు పాల్గోరె వేవిధముల
ననిదెల్పెననివింటి అది యసత్యంబెప్పు
భీష్ముఁడంతటివాఁడు వేవిధముల
మీ పక్షమునుబూని మెలఁగుచుండిన తాను

యుద్ధంబు జేయఁడే? యూరకొనునె ?
యూరకొనుటె గాదు, యుద్ధంబుజేసి మీ
వీరులఁ బోరులో పిల్కుమార్చె
దుర్జేయుఁడౌచు మీతోడ పోరాడె, తా
మీ పక్షముండిన మెలగునెయిటు ?
చెప్పినదంతయు చేసితీరెడువాఁడు
ధర్మంబు జేయంగదలఁచువాఁడు
స్వచ్ఛందమరణంబు వరియించువీరుండు
స్వేచ్ఛగాజీవించి చెలఁగువాఁడు
వీరుల నప్రతివీరుండు భీష్ముండు
సద్బ్రహ్మచారి సచ్ఛాస్త్రవేత్త
పితృవాక్యపాలనాభీష్టుండు భీష్ముండు
పరమభక్తుండు శుభంకరుండు
అట్టి భీష్ముడు మాకు నభయమిచ్చెనుగాని
మీ పక్షమందున మెలగెనెక్కొ ? |
త్రికరణంబులలోనఁ దెలియనౌకర్మంబు
మనమును వాక్కును మాటుబెట్ట
ననువగు, కావున నగ్రగణ్యంబైన
కర్మంబుచే మన గతులుదెలియు
కర్మమే మదికి సాక్ష్యంబౌనగును, కర్మ

మరియు వాక్కునకు సాక్ష్యంబొసంగు
కర్మంబునకును సాక్ష్యంబులేదిక, కాన
కర్మంబుచే నరుఁ గనఁగనగును
మాపీట భీష్ముండు మనలుచు మీపక్ష
మునఁజెప్పినన ధర్మమునకు దూర
మాగాదె; మీమాటయునుగు టసత్యము
గావలె, చెప్పిన కౌరవతతి
వినకుండవలెగాక, వృద్ధుఁడై కురువంశ
మునజ్యేష్ఠుఁడై రాజ్యమును త్యజించి
మాతండ్రి కొసఁగిన మహితాత్ముఁడే దెల్ప
పాండవపతులకు పాలుగాక
భారతవర్షంబు పాలింపనొసఁగఁడె
మాతండ్రి మునివృత్తి మమునేబూని?
కావున భీష్ముండు కౌరవసభలోన
పాండవపక్షంబు బలుకలేదు
చెప్పిన కౌరవుల్ చేయకుండుటయెప్డు
సంభవింపదుమరి, సంభవించె
నేని మమ్ములవీడి యేగఁడే, ఆనాడె
మమ్ములఁ బరిమార్చి మాదు రాజ్య
లక్ష్మిని బల్మిమైలాగి దెచ్చియు మీదు

చరణసన్నిధి నిల్వఁజాలడొకో?
ఆరీతిజరుగమి కౌరవసభలోన
పాండవపక్షంబు బలుకలేదు
కావున భీష్ముని కర్మమే దీనికి
ప్రతిబలసాక్ష్యంబొచు ప్రతిబలుచుండె
త్రికరణశుద్ధుఁడై దేవత్వమునుగన్న
భీష్ముండె వాక్కున వేరువిధము
కర్మమున మఱొక్కగతి నేగెనని బల్క
సత్యేతరంబైన సాహసవచ 380
నంబుగాదె యిటు లన్యాయముగాబల్కు
వ్యాసమహర్షి సద్వర్తనమును
గూర్చి తెల్పెదవిను, కోర్కెనితని పిత
సర్వధర్మంబుల సంగ్రహముగ
నేర్పి, పై మనుధర్మనియమంబులను దెల్ప
వ్యాసుండునేర్చియు భక్తితోడ
పరనారులు పయి విస్పష్టలునైన యం
బాలికాదుల పొందువడ సినాడు
సద్బ్రహ్మచారిగా జనుచున్న భీష్ముఁడ
య్యంబికాదులపొందునందినాడె 385
పితృవాక్యపాలనా భీష్టతయీరీతి

యుభయుల మధ్యను నుండెగనుము
తండ్రిమాటలఁ జవఁదాటెను వ్యాసుండు
పితాజ్ఞ పాలించె భీష్ముఁడెపుడు
వ్యాసుండు ధృతరాష్ట్రపాండురాజులఁగాంచి
యంబికఁ బంపిన సతివశూద్రి
కన్యను బొందడే కామాతిశయమున?
మొదటదానేగిన ముగుదనంబి
కమఱచెనో, లేక కామాంధతమఱచి
దాసినేయంబికాతరుణియంచు 890
గూడెనో, కనుఁడిద్ది కురువృద్ధభీష్ముండు
కలలోన బరకాంతఁ దలఁపడెపుడు
వ్యాసుఁడెన్న నిషాద వనితకుజన్మించె
కామార్తుఁడౌ తండ్రి కడుపునుండి
పూతయౌ గంగకు బుట్టినభీష్ముండు
సత్క్షత్రియుండంచు జగమెఱుంగు
శూద్రిసంజాతులౌ సూతసంజయులకు
వ్యాసుండు వేదంబులన్ని జెప్పె
వేదంబులనుమాని భీష్ముండుసర్వదా
ధర్మంబులను దెల్పె తగిసయపుడు
ఒక్కవనితఁబొంద బెక్కంపుత్రిపతులకు

ననుమతించెను మనవ్యాసుఁడపుడు
భీష్ముండు ద్రౌపదిపెండ్లికొప్పగలేదు
కులసతియని యామెదలఁపడెపుడు
కావునవీరల ఘనుఁడెప్డుభీష్ముఁడు
తదుపరివ్యాసుని దలపఁవలెను
మాయుప్పుఁ దినుటచే మాపక్షముననుండె
భీష్ముఁడంచును దెల్పవెఱ్ఱిగాదె
కౌరవరాజ్యంబు గాంగేయునిదిగాని
ధృతరాష్ట్రునిదిగాదు; అతఁడెపితకు
రాజ్యంబొసంగెను, ప్రభువైనభీష్ముండు
తా దినకరమె మాకు దయనొసంగె
నోగిరంబింత; మాయుప్పుతాఁదినునొ, మే
మాతనిబోనంబు నారగించు
చుంటిమో తెలియదే యుర్విజనులకెల్ల
వినయవిధేయతల్ వీడుచుండి
విశ్వాసహీనులై భీష్మునిరాజ్యంబు
గ్రహియించిపాలించె కౌరవతతి
యనునింధపాజ్జేయవ్యాసుఁడట్లనె, మరి
గాంగేయుజన్మాది కథలనెల్ల
దానెఱింగియు నిట్లధర్మంబులనుదెల్ప

పాడియౌనొక్క మీవ్యాసునకును
కథకుండుకవియును కథనొకపాత్రిగా
నుండిన సత్యంబు నుండదందు
తన పక్షమునునుంచు ఘనతయుకీర్తియు
మరిలాతివారికి మసినిబూయు
తిన పక్షముననుంచు ఘనజయాదులనెల్ల
పరులకపజయంబు ప్రాప్తిజేయు
కథలోనిపాత్రిగా కవియున్నతనపక్ష
విజయంబువర్ణించు వేవిధముల
కథగమనికమార్చు, కావ్యంబునందలి
యితివృత్తమెల్ల గ్రహించి ధర్మ
మంతయు తనదిగా నందులిఖించును
కావున సత్యంబుగ్రాలదందు
జరిగినవృత్తంబు జరిగినరీతిగా
గ్రహియించిదెలిపెడి కవికథకులు
ధన్యులు;కావ్యంబు ధన్యతగాంచును
అందునె సత్యంబునందవచ్చు
కవియొప్పుతీర్పరిగాఁ గ్రాలుచుండును
తీర్పరి వాదిగా తివిరియొక్క
పక్షంబునందుండి వాదించి, పదపడి

తీర్పరియైన నాతీర్పునందు
నెంతసత్యంబదియెనఁగునో, ఆరీతి
కథలోనిపాత్రగా కవియెయున్న
నాకవిగ్రంథంబునందున నంతియే
సత్యంబుఁగననగు; సత్యరతిని
వ్రాయుటవ్యాసుండు పాపశాంతికిదాను
భాగవతంబును వ్రాయఁదొడఁగె
ఆవ్యాసవాక్యంబు లాలింపలేదేమి
యని నీవుప్రశ్నించు నవసరమున 420
నేనొక్కవిషయంబు నిదమిద్ధమంచును
దెలిపెద, వినుమిక త్రికరణముల
వ్యాసుండుపాండవ పక్షంబువాఁడను
సర్థంబు జగతి శిలాక్షరంబు

—: బలరాముఁడు :—

నీవాక్యములయందు నేర్పునుగనుగొంటి
ధర్మంబు సత్యంబు దనరుచుంట
కృష్ణుఁడే యాఘోరకృత్యంబులకు నెల్ల
మూలకందంబంచు మొదటగంటి
పాండవదుస్థితి భరియింపలేమి నీ
దారుణంబులఁజేయఁ దలఁచినావు

నీయేపు సహియింపనేరమి దానిట్టి
దారుణంబులఁజేయదలఁచినావు
ధర్మంబునీది, యధర్మముపాండవ
పతులది; కావునవత్స! నీకు
శాశ్వతసౌభాగ్యసత్కీర్తి దాయక
స్వారాజ్యసౌఖ్యసంప్రాప్తిరస్తు!
విగతకల్మషకాశివిశ్వేశపదచింత
నానందసంప్రాప్తిరస్తు!! నీకు

—: దేవతలు :—

(ఆకసమునుండి పుష్పవర్షముఁ గురియించుచు)

సత్యమురారాజ! సత్యమది తథాస్తు!!

(పాండవులు మోములవాంతురు)

—: కృష్ణుఁడు :—

పాండవపక్షసంబంధములను 430
త్యజియింపలేమిని ధర్మంబువీడుచు
నీ సుయోధను వధియించినాడ
కలిరాజయుగనాటకంబున కియ్యది
నాందిగా జూపించినాడ నిపుడు
భీష్మాదియోధులు విక్రమశూరులు
పరివృతులై కొల్చు ప్రభువెవ్వైన

రారాజుగానుండి లక్షలకొలఁదిగా
చతురంగబలములు సంగ్రహించి
కర్ణాదిప్రముఖు లఖండసహాయ్యము
ద్రోణాదిగురువుల దోర్బలంబు
సమకూర్చుకొనుచును సద్ధర్మరతుఁడౌచు
సర్వసర్వంసహాచక్రతలము
కొనగోరనిల్పుచు జనులఁబాలించెడి
ప్రభువైనఁ, దానెడ్డు పంతమూని
రాజ్యాంగ వేత్తయే రణరంగముననిల్చి
యుద్ధంబు జేయుచునున్న వేళ
ప్రభున కపజయంబు; రాజ్యాంగవేత్తకు
జయమును సర్వదా సంభవించు
నిదినిరూపింపంగ నేనిట్టియుద్ధంబు
నొనరించి విజయంబునొందినాడ
పాండవపతియింక ప్రభువైననేమైన
నాకేల?/ఇక స్మశానంబులెల్ల
పాలించుకొననిమ్ము, పక్షపాతంబుచే
నీహత్యలెల్ల జేయించినాడ /
ఓసుయోధన! నీవె యుత్తమపురుషుండ
వఖిలధర్మములు నీయందెగలవు /

ధర్మంబువీడి యధర్మయుద్ధంబున
నన్యాయ మార్గంబు నందునిన్ను
నొంటిగా జేయుచు నుక్కడఁగించితి
నిదియెల్ల నాకృత్యమేయటంచు
సత్యంబు పలికె నాసహజన్ముఁడిప్పుడు
దేవతాతతియు కీర్తించెనిన్ను
నెతికవిజయంబు న్యాయంబుగానిది
ధర్మరాజునకధర్మ జయము
శాశ్వతానందంబు సమకూడునీకింక
నకలంకస్వర్గసౌఖ్యంబు గలుగు

—:బలరాముఁడు:—

పాండవపతులెల్ల పాపంబుఁగొనరింప
శపియింపకయె నుండఁజాలనిపుడు
రాజ్యాంత మందున రాజైనధర్ముండు
సోదరతతితోడ చొచ్చుగాత
నరకంబు; తిరుగదు నామాట, పోయివ
చ్చెదను సుయోధనా, శిష్య! నీకు
నేయుపకృతియును నేజేయలేకుంటి
తీర్థయాత్రలయందు దిరుగుచుంట
సచ్చితానందుని సామీప్యమును జేర

నుండిన నీవె ధన్యుండ వెపుడు
పుణ్యాత్మ లెప్పుడు ముందుపోవుచునుంద్రు
స్వారాజ్య సౌఖ్యసంపదలనంద
కడమవారందరు కాలానుగుణముగ
పోవుచుందురు నారి పుణ్యపాప
గతులననుసరించి, కానియీజగతిని
నుట్టిగట్టుక నెవ్వరుండబోవ
రిందరి పాత్రింబు లీరీతి దీయంగ
ననుమతించిన కృష్ణుఁడష్టపడిన
మృత్యువీపాండు భూమీశుల మ్రింగక
వదలదెప్పుడు చక్రవర్తులనుచు
షట్చక్రవర్తులే సమయంగ వీరలా
శాశ్వతంబుగ నేల జాలువారు?
ఇహలోకనాటకం బీరీతినాడియుఁ
దెరపడ నందరు తెల్లపోయి
మనజన్మ మొక్కడ మనయున్కియొక్కడ
మనదృష్టి యొక్కడననుచు మఱచి
తమలోనఁదామిట్లు మమకారములవీడి
కలహించి కూలుదుర్క్రమముగాను
వనములఁ బుట్టిన ఘనవృక్షములు వ్రాలి

వనములఁబడి కొట్టుకొనుచుబోయి
యేయేటనో కూడి యేయేటనో వీడి
తరలిపోవుచును సంద్రమునఁజేరు
నారీతిజనతతి నరసిన కాలప్ర
వాహంబునఁదేనఁ బడినవార
లేరీతినోగూడి యేరీతినోవీడి
పరలోకమునఁ జేరుదురు కడపట
కూడు నష్టము నొనగూడును సౌఖ్యంబు
వీడునష్టముమనోవీధియందు
దుఃఖం బుగల్గును, తుద సుఖదుఃఖముల్
తరలుచుండును శాశ్వతములుగాక
పుట్టినవారెల్ల గిట్టుచుందురుగాన
నీచావుక్రొత్తగానేరదిలకు
మరలింపరానట్టి మరణంబు నొందంగ
నున్ననీవే చింతలొందకుండ
సచ్చితానందుని సంస్మరణంబున
కడమకాలంబెల్ల గడపనిమ్ము
ఇహలోకబంధంబు లేమియుఁగనకుండ
శ్రీరామనామంబు చింతసేయు

[భరతవాక్యము.]

గీ॥ మఖిలకల్యాణ గుణమూర్తి యైనరాముఁ
దలఁచినంతనెపాపముల్ తరలఁజేసి
వీరువారను భేదంబు బెట్టకెప్పు
డుర్వి పాత్రుల నొకరీతి నోముగాత!!

[సంపూర్ణము.]

కొన్ని దిద్దుబాటులు. 1 వ పుటలో పాండబ-పాండవ 24 లో అర్జున-అర్జును 81 లో సహించలేమని-సహాయించలేమని 87 లో పాల్గును-పాల్గొను